ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు


SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 173 గురువారం 11 - 06 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 173 Thursday 11 - 06 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-


## ‘భారత్ ఫ్యూచర్ సిటీ’
# కల సాకారమయింది

- ఫ్యూచర్ సిటీ ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించనున్న రేవంత్
- ఇది చరిత్రలో నిలిచిపోయే రోజు అన్న రేవంత్
- ఆధునిక భారతదేశానికి నూతన నగరంగా ఫ్యూచర్ సిటీ నిలవబోతోందని వ్యాఖ్య
- ప్రపంచంలోని గొప్ప నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్న సీఎం
- హైదరాబాద్ ఖ్యాతిని ప్రపంచస్థాయికి తీసుకెళ్లే ‘భారత్ ఫ్యూచర్ సిటీ’ కల సాకారమయ్యేందుకు తొలి అడుగు



**వార్త సంధ్య, హైదరాబాద్, జూన్ 10 :**
తెలంగాణ చరిత్రలో ఒక సరికొత్త మైలురాయి లిఖించబడబోతోంది. హైదరాబాద్ ఖ్యాతిని ప్రపంచస్థాయికి తీసుకెళ్లే ‘భారత్ ఫ్యూచర్ సిటీ’ కల సాకారమయ్యేందుకు తొలి అడుగు పడింది. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రధాన కార్యాలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు సాయంత్రం అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ భవన ప్రారంభోత్సవం అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో సీఎం ప్రసంగించనున్నారు. ఈ చారిత్రాత్మక సందర్భంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. “ఇది చరిత్రలో నిలిచిపోయే రోజు. ఆధునిక భారతదేశానికి నూతన నగరంగా ఈ భారత్ ఫ్యూచర్ సిటీ నిలవబోతోంది” అని అత్యంత ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు. ఈ అథారిటీ భవనాన్ని కేవలం 6 నెలల రికార్డు సమయంలోనే నిర్మించి పూర్తి చేయడం విశేషం. దాదాపు రూ.20 కోట్ల వ్యయంతో, 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ అత్యాధునిక భవనాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. ప్రణాళిక, సాంకేతికత, సుస్థిర అభివృద్ధికి ఈ ఫ్యూచర్ సిటీ ఒక నిలువెత్తు ప్రతీకగా మారబోతోందని సీఎం వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్‌లోని మరో విశేషం ఏంటంటే.. ఈ భవనం ప్రారంభం కాకముందే ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుండి ‘నెట్ జీరో’ భవనంగా గుర్తింపు పొందింది. అంటే పర్యావరణానికి - మిగతా 2 లో

## 2047 వరకు మోదీయే ప్రధానిగా కొనసాగాలి



- కేంద్ర మంత్రి బండి సంజయ్
- ప్రధానిగా నెహ్రూ రికార్డును మోదీ బద్దలు కొట్టారన్న బండి సంజయ్
- అత్యధిక కాలం ప్రధానిగా మోదీ పేరు లిఖించబడిందని హర్షం
- మీనాక్షి నటరాజన్ వ్యవహారం ఎన్నికల కమిషన్ పరిధిలోనిదని వ్యాఖ్య

**వార్త సంధ్య, హైదరాబాద్, జూన్ 10 :**
భారత రాజకీయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరికొత్త చరిత్ర సృష్టించారని, దేశంలో అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన - మిగతా 2 లో

## ఐటీ ఏరియాలో ఈగల్ ఫోర్స్ భారీ ఆపరేషన్

EAGLE FORCE
ELITE ACTION GROUP FOR DRUG LAW ENFORCEMENT

- పారిపోయిన డ్రగ్‌డాన్ నీతూబాయ్
- నీతూబాయ్ కోసం నానక్‌రామ్‌గూడాలో మకాం వేసిన ఈగల్ ఫోర్స్
- గతంలోనే ఆమెను అరెస్టు చేసి పీడీ యాక్ట్ పెట్టిన పోలీసులు
- జైలు నుంచి వచ్చి మళ్లీ అమ్మకాలు కొనసాగిస్తున్న నీతు

**వార్త సంధ్య, హైదరాబాద్, జూన్ 10 :**
తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్ కేసులు కలవర పెడుతున్నాయి. ఈ సమస్యను రూపుమాపేందుకు ఈగల్ ఫోర్స్ శ్రమిస్తోంది. దీనిలో భాగంగానే హైదరాబాద్ ఐటీ ఏరియాలో - మిగతా 2 లో

## ప్రధానిగా నెహ్రూ రికార్డును బ్రేక్ చేసిన నరేంద్రమోదీ

- తెలంగాణ బీజేపీ చీఫ్ స్పందన
- సుదీర్ఘకాలం ఎన్నికైన ప్రధానిగా నెహ్రూ రికార్డును అధిగమించిన మోదీ
- నిరంతరాయంగా 4,399 రోజులు ప్రధానిగా సేవలు
- ఇది చారిత్రక మైలురాయి అంటూ రామచంద్రరావు ప్రశంస
- మోదీ పాలనలో దేశం స్వర్ణయుగాన్ని చూస్తోందన్న రామచంద్రరావు
- ప్రధానికి శుభాకాంక్షలు తెలుపుతూ కేంద్ర కేబినెట్ తీర్మానం



**వార్త సంధ్య, ఢిల్లీ, జూన్ 10 :**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత ప్రజాస్వామ్య చరిత్రలో అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. అత్యధిక కాలం నిరంతరాయంగా ప్రధాని పదవిలో కొనసాగిన నేతగా జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును ఆయన అధిగమించారు. నెహ్రూ 4,398 రోజుల పాటు ఈ పదవిలో ఉండగా, మోదీ 4,399 రోజులు పూర్తి చేసుకుని నూతన చరిత్రను లిఖించారు. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని తెలంగాణకు చెందిన బీజేపీ నాయకులు రామచంద్రరావు ప్రధాని మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. ఇది ఒక చారిత్రక మైలురాయి అని ఆయన ‘ఎక్స్’ వేదికగా పేర్కొన్నారు. 140 కోట్ల భారతీయుల ఆకాంక్షలకు, అచంచలమైన నమ్మకానికి మోదీ నిదర్శనమని, ఆయన పదవీకాలం దేశ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయమని కొనియాడారు. నరేంద్ర మోదీ 2014 మే 26న తొలిసారిగా ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం 2019లో రెండోసారి, 2024 జూన్ 9న సంకీర్ణ ప్రభుత్వ సారథిగా మూడోసారి పగ్గాలు చేపట్టారు. మోదీ నాయకత్వంలో పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత, ఆర్టికల్ 370 రద్దు, నక్సలిజం అణచివేత, సరిహద్దుల బలోపేతం వంటి కీలక రంగాల్లో దేశం గణనీయమైన పురోగతి సాధించిందని రామచంద్రరావు వివరించారు. మరోవైపు, ప్రధాని మోదీ - మిగతా 2 లో

## మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ రద్దు



- మీనాక్షి రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ
- తెలంగాణ కేసు వెల్లడించలేదంటూ వివాదం
- కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం
- చర్చలోకి ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 33ఏ

**వార్త సంధ్య, ఢిల్లీ, జూన్ 10 :**
కాంగ్రెస్ సీనియర్ నేత మీనాక్షి నటరాజన్ రాజ్యసభ ఎన్నికల నామినేషన్ తిరస్కరణ రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. మధ్యప్రదేశ్ నుంచి దాఖలు చేసిన ఆమె నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించడంతో కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆరోపించింది. తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ఓ కేసు వివరాలను అఫిడవిట్‌లో - మిగతా 2 లో

### ఏపీలో తక్కువ జనాభా అయినా
## నిధుల్లో టాప్ 3లో ఏపీ

- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- తక్కువ జనాభా ఉన్నప్పటికీ కేంద్ర నిధుల వాటాలో ఏపీ దేశంలోనే మూడో స్థానంలో ఉందని వెల్లడి
- ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రానికి రూ.7,700 కోట్లు అందాయన్న కేంద్ర మంత్రి
- అమరావతిలో కేంద్ర ప్రభుత్వ భవనాల నిర్మాణం మూడేళ్లలో పూర్తవుతుందని వెల్లడి



**వార్త సంధ్య, అమరావతి, జూన్ 10 :**
తక్కువ జనాభా ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు పొందుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో నిలిచిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో - మిగతా 2 లో

## భారీ మూల్యం తప్పదన్న డొనాల్డ్




- ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరిక
- ‘మిడిల్ ఈస్ట్ రౌడీ చనిపోయాడు’ అంటూ పోస్ట్
- అమెరికా హెలికాప్టర్ కూల్చివేతతో పెరిగిన ఉద్రిక్తతలు

## 24 గంటల్లోనే చెప్పిన మాట నిలబెట్టుకున్న మంత్రి లోకేశ్

- విశాఖ స్టీల్‌ప్లాంట్ మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున చెక్కులు అందించిన మంత్రి
- ఒక్కో కుటుంబానికి రూ. 1.72 కోట్ల వరకు ప్రయోజనాలు, ఉద్యోగం ఇస్తామన్న పవన్
- ప్రమాద కారణాలపై కేంద్ర ఉక్కుశాఖ త్రిసభ్య కమిటీ విచారణ ప్రారంభం
- రూ. 120 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా



**వార్త సంధ్య, అమరావతి, జూన్ 10 :**
విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపుతూనే ఉంది. ఈ ఘటనలో మృతుల సంఖ్య 9కి చేరింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పైడిరాజు అనే మరో ఉద్యోగి ఇవాళ ఉదయం ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ధ్రువీకరించారు. దీంతో ప్లాంట్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. మరోవైపు ప్రభుత్వం ప్రకటించిన సహాయక చర్యలు వేగంగా అమలవుతున్నాయి. మంగళవారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ బాధిత కుటుంబాలను పరామర్శించి, ఇచ్చిన మాట ప్రకారం 24 గంటలు - మిగతా 2 లో

### అమరావతిలో రూ.1235 కోట్లతో
# కేంద్రం భారీ ప్రాజెక్ట్

- ఏపీ రాజధానిలో కీలక పరిణామం..
- అమరావతిలో భారీ ప్రాజెక్టుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల నివాసాల కోసం రూ.1235 కోట్లు కేటాయింపు
- మొత్తం 11 టవర్లలో 1504 నివాస గృహాలు నిర్మించనున్న సీపీడబ్ల్యూడీ
- పర్యావరణ హితంగా, గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలతో నిర్మాణం
- నిర్మాణ, నిర్వహణ దశల్లో స్థానికంగా భారీగా ఉపాధి అవకాశాలు



**వార్త సంధ్య, అమరావతి, జూన్ 10 :**
ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అభివృద్ధి పనుల దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ), అమరావతిలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం భారీ నివాస సముదాయాల నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు కోసం రూ.1,234.91 కోట్లను కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్ట్ వ్యయాన్ని పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే బడ్జెటరీ మద్దతు ద్వారా భరించనుంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (సీపీడబ్ల్యూడీ) చేపట్టనుంది. ఇప్పటికే - మిగతా 2 లో

# సంపాదకీయం

## మయన్మార్‌తో చెలిమి

అనుచిత కారణాలవల్ల తరచు వార్తల్లో ఉండే మయన్మార్ నుంచి ఆ దేశాధ్యక్షుడు మిన్ ఆంగ్ హ్లాయింగ్ అయిదు రోజుల పర్యటన కోసం శనివారం మన దేశం వచ్చారు. ఆయనతోపాటు వచ్చిన బృందంలో కేబినెట్ మంత్రులు, వ్యాపారవేత్తలు ఉన్నారు. కొన్ని దశాబ్దాలక్రితం ఇలాంటి పర్యటన ఊహించలేం. ఎందుకంటే ఆ దేశం నిరంతరం సైన్యం పడగనీడలో మనుగడ సాగిస్తోంది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను సైన్యం బతకనీయదు. 2020లో తిరుగులేని మెజారిటీతో వరసగా రెండోసారి ఎన్నికైన ప్రజా స్వామ్య ఉద్యమ నేత ఆంగ్ సాన్ సూకీ నాయకత్వంలోని నేషనల్ లీగ్ ఫర్ డెమాక్రసీ (ఎన్ఎల్‌డీ) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా, ఏడాదిలోపే సైనిక దళాలు హస్తగతం చేసుకున్నాయి. మన పొరుగును మనం ఎంచుకోలేం. అక్కడ ఎలాంటి ప్రభుత్వాలుండాలో ఆశించటం కూడా అసాధ్యం. మారుతున్న ప్రపంచ పరిణామాల నేపథ్యంలో మన ప్రయోజనాలు తప్ప వేరే దేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లాలని, అందుకోసం అక్కడి పాలకులపై 'నైతిక ఒత్తిడి' తీసుకురావాలనుకోవటం వృథా ప్రయాసగా, అనవసర చాదస్తంగా భావించే ధోరణి అలుముకుంది. మార్క్సిజాన్ని అనుసరిస్తున్నానని చెప్పుకొనే చైనా దశాబ్దాల క్రితమే ఈ సూత్రాన్ని నమ్మి మయన్మార్‌ను అక్కున చేర్చుకుని అన్నివిధాలా లాభపడింది.వాస్తవానికి మయన్మార్‌తో మన దేశానికి సన్నిహిత సంబంధాలుండేవి. 1951లో ఆ దేశంతో స్నేహ ఒప్పందం కుదిరింది. 1955లో మనతోపాటు అలీనోద్యమ అంకు రార్పణకు తోడ్పడిన దేశాల్లో మయన్మార్ ఒకటి. కానీ 1958లో సైనిక పాలకుల ఆగమనం తర్వాత ఆ సంబంధాలు దెబ్బతిన్నాయి. మనమే కాదు... దాదాపు ప్రపంచ దేశాలన్నీ దానితో 'దౌత్యపరమైన అంటరానితనాన్ని' పాటించటం మొదలెట్టాయి. 1988లో ప్రజాస్వామ్య ఉద్యమాన్ని సైనిక పాలకులు అణిచేయటాన్ని నిరసిస్తూ సూకీకి భారత్ మద్దతు ప్రకటించింది. 1992లో జవహర్‌లాల్ నెహ్రూ అంతర్జాతీయ అవగాహన అవార్డుకు ఆమెను ఎంపిక చేసింది. కానీ వాజ్‌పేయి నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం 2002లో మళ్లీ దాంతో సంబంధ బాంధవ్యాలు పునరుద్ధరించి మాండలేలోని భారత కాన్సులేట్‌ను పునఃప్రారంభించింది. తిరిగి మళ్లీ 2014లో నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని ఎన్డీయే అధికారంలోకొచ్చేవరకూ ఇరు దేశాల సంబంధాలూ అంతంత మాత్రమే. 2017లో మోదీ మయన్మార్‌ను సందర్శించారు.మన దేశానికి మయన్మార్‌తో 1,643 కిలోమీటర్ల పొడవునా అంతర్జాతీయ సరిహద్దు ఉంది. ఇందులో ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్ (520 కి.మీ.), నాగాలాండ్ (215 కి.మీ.), మిజోరం (510 కి.మీ.), మణిపూర్ (398 కి.మీ.)ఉన్నాయి. 2021లో తిరిగి సైనిక పాలకులు అధికారం చేజిక్కించుకున్నాక మన దేశం గతంలో మాదిరి మయ న్మార్‌ను ఏకాకిని చేయాలనుకోలేదు. నిరంతరం సంబంధ బాంధవ్యాల్లో ఉంటే అక్కడ ప్రజాస్వామ్య పునరుద్ధరణకు అది దోహదపడుతుందనీ, దాంతోపాటు సరిహద్దు భద్రత విషయంలో మన ప్రయోజనాలు నెరవేరుతాయనీ భావించింది. దానికితోడు మయ న్మార్‌ను దూరం చేసుకుంటే అది చైనాకు దగ్గరకావటం మినహా సాధించేదేమీ ఉండదని కూడా అనుకుంది. అందుకే కావొచ్చు... సైనిక చీఫ్ పదవి వదులుకుని, దేశాధ్యక్షుడైన రెండు నెలల్లోనే తన తొలి విదేశీ పర్యటనకు మిన్ మన దేశాన్ని ఎంచుకున్నారు. నిరుడు డిసెంబర్, ఈ ఏడాది జనవరి మధ్య జరిపిన ఎన్నికల్లో మిన్ భారీ ఓట్లతో విజయం సాధించారు. దాదాపు అన్ని విపక్షాలనూ ఎన్నికల్లో పాల్గొననీయకపోవటంవల్ల ఇది సాధ్యమైంది. ఆ సంగతలావుంచి మయన్మార్‌తో కుదిరిన ఒప్పందాలు మన దేశానికి వ్యూహాత్మకంగా, భద్రతాపరంగా మేలుచేసేవే. అంతర్జాతీయ కరెన్సీ బదులు మన రూపాయి, మయన్మార్ క్యాట్‌లలో లావాదేవీలు జరుపుకోవాలనీ... ఇంధనం, మైనింగ్, ఆగ్రో ప్రోసెసింగ్ రంగాల్లో సహకరించుకోవాలనీ నిర్ణయించుకున్నాయి. అలాగే నౌకా శ్రయ నిర్మాణంలో మయన్మార్‌కు తోడ్పడేందుకు అవగాహన కుదిరింది. ఈశాన్య రాష్ట్రాల్లో అలజడి రేపే సంస్థలకు ఆశ్రయం లభించకుండా చర్యలు తీసుకుంటామని మయన్మార్ హామీ ఇచ్చింది. వర్తమానంలో ఇరుగు పొరుగుమధ్య సర్దుబాట్లు తప్ప 'అనవసర' చాదస్తాలు ఉండబోవని ఈ పర్యటన నిరూపించింది.

## మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ రద్దు

**మొదటిపేజీ తరువాయి -** వెల్లడించలేదనే కారణంతో నామినేషన్‌ను తిరస్కరించారు. దీనిపై బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. అయితే కాంగ్రెస్ వాదన మరోలా ఉంది. హైదరాబాద్‌లోని కోర్టు జారీ చేసిన నోటీసు కేవలం ప్రాథమిక విచారణలో భాగమే తప్ప, ఆమెపై అధికారిక క్రిమినల్ కేసు నమోదు కాలేదని చెబుతోంది. ఇంకా కోర్టు నేరాన్ని పరిగణనలోకి తీసుకోలేదని, ఎలాంటి అభియోగాలు కూడా నమోదు కాలేదని పేర్కొంటోంది.ఈ వివాదానికి కేంద్రంగా నిలిచింది ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 33ఏ. దీని ప్రకారం రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ జైలు శిక్ష పడే నేరానికి సంబంధించి కోర్టు అభియోగాలు నమోదు చేసిన కేసులు ఉంటే వాటిని అభ్యర్థులు నామినేషన్ పత్రాల్లో వెల్లడించాలి. అలాగే ఏడాది లేదా అంతకంటే ఎక్కువ జైలు శిక్ష పడిన తీర్పులు ఉంటే కూడా తెలియజేయాలి.న్యాయ నిపుణుల అభిప్రాయం ప్రకారం కేవలం ప్రాథమిక విచారణ దశలో ఉన్న వ్యవహారాలను వెల్లడించాల్సిన అవసరం ఉండకపోవచ్చు. ఎందుకంటే అలాంటి సందర్భాల్లో కేసు పూర్తిస్థాయిలో ప్రారంభమైనట్లు పరిగణించరు. మీనాక్షి నటరాజన్ విషయంలో హైదరాబాద్ కోర్టు జారీ చేసిన నోటీసు వెల్లడించాల్సిన కేసు పరిధిలోకి వస్తుందా? లేక అది కేవలం ప్రాథమిక విచారణ మాత్రమేనా? అన్న అంశంపైనే ఇప్పుడు మొత్తం వివాదం కొనసాగుతోంది. ఈ అంశంపై ఎన్నికల సంఘం తుది నిర్ణయం కీలకంగా మారింది.

## ప్రధానిగా నెహ్రూ రికార్డును బ్రేక్ చేసిన నరేంద్రమోదీ

**మొదటిపేజీ తరువాయి -** ఘనతను అభినందిస్తూ కేంద్ర కేబినెట్ తీర్మానం చేసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్ షా సహా పలువురు బీజేపీ అగ్రనేతలు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## 'భారత్ ఫ్యూచర్ సిటీ' కల సాకారమయింది

**మొదటిపేజీ తరువాయి -** ఎలాంటి హాని చేయకుండా, సహజ వనరుల వినియోగంతో ఈ కార్యాలయాన్ని రూపొందించారు. ప్రపంచంలోని అత్యంత గొప్ప నగరాల్లో ఒకటిగా ఈ ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు వెళ్తోందని సీఎం స్పష్టం చేశారు.

## 2047 వరకు మోదీయే ప్రధానిగా కొనసాగాలి

**మొదటిపేజీ తరువాయి -** తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును బద్దలు కొట్టారని కేంద్ర మంత్రి బండి సంజయ్ కొనియాడారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం భారతదేశంలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన అరుదైన రికార్డు మోదీ పేరిట లిఖించబడిందని హర్షం వ్యక్తం చేశారు."రాబోయే 2047 సంవత్సరం వరకూ నరేంద్ర మోదీయే దేశ ప్రధానిగా కొనసాగాలి. ఆయన తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాల వల్ల ప్రపంచ దేశాల ముందు భారతదేశ కీర్తి ప్రతిష్ఠలు శరవేగంగా పెరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో ప్రపంచంలోనే భారత్‌ను 'విశ్వగురు' స్థానంలో నిలబెట్టడం ఖాయం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఇదే సమయంలో, దేశవ్యాప్తంగా సంచలనం రేపుతున్న కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ వ్యవహారంపై మీడియా అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ స్పందించారు. ఆ వివాదం పూర్తిగా కేంద్ర ఎన్నికల కమిషన్ పరిధిలోని అంశమని స్పష్టం చేశారు. ఇందులో రాజకీయ జోక్యం ఏమీ లేదని, చట్టప్రకారం ఈసీనే దానిపై తగిన నిర్ణయం తీసుకుంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

## ఐటీ ఏరియాలో ఈగల్ ఫోర్స్ భారీ ఆపరేషన్

EAGLE FORCE
TELANGANA
ELITE ACTION GROUP
FOR DRUG LAW ENFORCEMENT

**మొదటిపేజీ తరువాయి -** డ్రగ్‌డాన్ నీతుబాయ్ కోసం ఈగల్ ఫోర్స్ భారీ ఆపరేషన్ నిర్వహించింది. ఈగల్ ఫోర్స్ వస్తుందన్న సమాచారంతో డ్రగ్‌డాన్ నీతూబాయ్ పారిపోయింది.

**ఈగల్ ఫోర్స్ అదుపులో ఐటీ ఉద్యోగులు :** హైదరాబాద్ నగరంలో నీతూబాయ్ పెద్ద ఎత్తున గంజాయి విక్రయిస్తోంది. గంజాయి కొనుగోలు కోసం ఐటీ ఉద్యోగులు ఆమె ఇంటి దగ్గర క్యూ కట్టారు. గంటల వ్యవధిలో 50 మంది ఐటీ ఉద్యోగుల్ని ఈగల్ ఫోర్స్ పట్టుకుంది. ఆమె దూల్‌పేట నుంచి వచ్చి ఐటీ కోర్ ఏరియాలో గంజాయి కేంద్రాన్ని నిర్వహిస్తోంది. కిరాణం షాపు మాటున గంజాయి విక్రయిస్తోందని సమాచారం. పోలీసులు గతంలోనే ఆమెను అరెస్టు చేసి పీడీ యాక్ట్ పెట్టారు. అయినా జైలు నుంచి వచ్చి మళ్లీ గంజాయి అమ్మకాలు కొనసాగిస్తోంది.

# అమరావతిలో రూ.1235 కోట్లతో కేంద్రం భారీ ప్రాజెక్ట్



**మొదటిపేజీ తరువాయి -** ప్రీ-బిడ్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని, టెండర్ పత్రాల రూపకల్పన ప్రక్రియ పురోగతిలో ఉందని కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో, ముఖ్యంగా రాజధాని అమరావతిలో కేంద్రం చేపడుతున్న మొట్టమొదటి జనరల్ పూల్ రెసిడెన్షియల్ అకామడేషన్ (జీపీఆర్ఏ) ప్రాజెక్ట్ ఇదే కావడం గమనార్హం.మొత్తం 17 ఎకరాల విస్తీర్ణంలో ఈ జీపీఆర్ఏ క్యాంపస్‌ను నిర్మించనున్నారు. ఇందులో భాగంగా 11 నివాస టవర్లను ఏర్పాటు చేసి, టైప్-2 నుంచి టైప్-ఎ× వరకు వివిధ కేటగిరీలలో మొత్తం 1,504 ఫ్లాట్లను నిర్మిస్తారు. ప్రాజెక్టులో భాగంగా 1,972 కార్లు పార్క్ చేసుకునేలా బేస్‌మెంట్ పార్కింగ్ సదుపాయం కల్పిస్తారు. ఈ ప్రాజెక్టు మొత్తం నిర్మాణ విస్తీర్ణం 31.30 లక్షల చదరపు అడుగులుగా ఉంది.

**ప్రాజెక్ట్ లక్ష్యాలు.. ప్రయోజనాలు**

అమరావతిలో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై ఆర్థిక భారాన్ని తగ్గించి, వారికి తగిన నివాస సౌకర్యం కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. కార్యాలయాలకు సమీపంలోనే నివాసం ఉండటం వల్ల ఉద్యోగుల నైతిక స్థైర్యం, పనితీరు మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఇది ప్రభుత్వ కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా సాగేందుకు దోహదపడుతుందని ప్రకటనలో వివరించారు.

**పర్యావరణ హిత నిర్మాణం.. సకల సౌకర్యాలు**

ఈ ప్రాజెక్టును పూర్తిగా పర్యావరణ హితంగా, గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించనున్నారు. కనీసం 4-స్టార్ గ్రీహా (జీఆర్ఐహెచ్ఏ) రేటింగ్ సాధించేలా, ఇంధన సామర్థ్యం, నీటి సంరక్షణ, స్థానిక నిర్మాణ సామగ్రి వాడకం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తారు. క్యాంపస్‌లో బ్యాంకు, ఏటీఎం, పోస్టాఫీసు, కమ్యూనిటీ హాల్, ఫుడ్ కోర్ట్, షాపింగ్ కాంప్లెక్స్, గెస్ట్ హౌస్ వంటి అన్ని రకాల పౌర, సామాజిక సదుపాయాలు ఉంటాయి. అలాగే, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా అవరోధ రహిత వాతావరణాన్ని కల్పించనున్నారు.ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా. నిర్మాణ దశలో ఏటా సుమారు 7 లక్షల పనిదినాలు, ప్రాజెక్టు పూర్తయ్యాక నిర్వహణ దశలో ఏటా 50,000 పనిదినాల ఉపాధి కలుగుతుందని కేంద్రం తెలిపింది.

# భారీ మూల్యం తప్పదన్న డొనాల్డ్

**మొదటిపేజీ తరువాయి -** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి పరాకాష్టకు చేరాయి. చర్చల ప్రక్రియలో ఇరాన్ జాప్యం వహిస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు. "మిడిల్ ఈస్ట్ రౌడీ చనిపోయాడు" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సంచలనం సృష్టిస్తున్నాయి. ఇరాన్‌లోని మౌలిక సదుపాయాలపై మరిన్ని దాడులు చేసే అవకాశం ఉందని సంకేతాలను ఆయన ఇచ్చారు.బుధవారం 'ట్రూత్ సోషల్' వేదికగా స్పందించిన ట్రంప్, "ఇరాన్ సైన్యం ప్రస్తుతం తీవ్ర అస్తవ్యస్త స్థితిలో ఉంది. వారి నౌకాదళం, వాయుసేనలు దాదాపుగా ఉనికి కోల్పోయాయి. చర్చలకు రావడంలో వారు ఇప్పటికే చాలా ఆలస్యం చేశారు, ఇప్పుడు దానికి తగిన ప్రతిఫలం అనుభవించక తప్పదు" అని పేర్కొన్నారు.అమెరికాకు చెందిన ఏహెచ్-64 అపాచీ హెలికాప్టర్‌ను కూల్చివేసిన ఘటన తర్వాత ఈ ఘర్షణ వాతావరణం నెలకొంది. దీనికి ప్రతిచర్యగా, మంగళవారం హోర్ముజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ వాయు రక్షణ వ్యవస్థలు, రాడార్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా దళాలు దాడులు నిర్వహించాయి. ఇది కేవలం ఆత్మరక్షణ కోసం చేపట్టిన చర్యేనని యూఎస్ సెంట్రల్ కమాండ్ స్పష్టం చేసింది. హెలికాప్టర్‌లోని ఇద్దరు సిబ్బందిని సురక్షితంగా రక్షించినట్లు వెల్లడించింది.అయితే, తమ డ్రోన్‌ను అమెరికా హెలికాప్టర్ ఢీకొట్టడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఇరాన్ వాదిస్తోంది. ఇందుకు ప్రతీకారంగా బహ్రెయిన్, జోర్డాన్, కువైట్‌లలోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణి దాడులు చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇరాన్ అణు, సైనిక కేంద్రాలపై అమెరికా-ఇజ్రాయెల్ దళాలు దాడులు చేసినప్పటి నుంచి ఈ వివాదం కొనసాగుతోంది. తాజా



పరిణామాల ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరగగా, స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను చవిచూశాయి.

## ఏపీలో తక్కువ జనాభా అయినా నిధుల్లో టాప్ 3లో ఏపీ



**మొదటిపేజీ తరువాయి -** మాట్లాడిన ఆయన, రాష్ట్రానికి లభిస్తున్న ప్రత్యేక ప్రయోజనాల వల్లే ఈ స్థాయిలో నిధులు మంజూరవుతున్నాయని వివరించారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పటి వరకు రూ.7,700 కోట్లు అందాయని పెమ్మసాని వెల్లడించారు. అలాగే, రాష్ట్ర రాజధాని అమరావతిలో కీలక భవనాల నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వ రాబోయే మూడేళ్లలో పూర్తి చేసే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టులకు అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించగా, నిర్మాణ వ్యయాన్ని పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరించనుందని ఆయన పేర్కొన్నారు.అమరావతి క్యాపిటల్ నిర్మాణం, సెంట్రల్ సెక్రటేరియట్, ఔటర్ రింగ్ రోడ్ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి అత్యంత కీలకమని మంత్రి స్పష్టం చేశారు. ఈ అంశాలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏపీ అభివృద్ధిని వేగవంతం చేసే ప్రక్రియలో భాగంగా ఈ నిర్ణయాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు మెరుగుపడటంతో పాటు, పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## 24 గంటల్లోనే చెప్పిన మాట నిలబెట్టుకున్న మంత్రి లోకేశ్



**మొదటిపేజీ తరువాయి -** గడవకముందే మంత్రి లోకేశ్ చర్యలు చేపట్టారు. మృతుల కుటుంబాలకు తక్షణ పరిహారం కింద రూ. 25 లక్షల చొప్పున చెక్కులను స్వయంగా అందించారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం తరపున మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షలు, క్షతగాత్రులకు రూ. 10 లక్షలు అందిస్తామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రకటించారు. దీనికి అదనంగా రెగ్యులర్ ఉద్యోగి కుటుంబానికి అన్ని ప్రయోజనాలు కలిపి రూ. 1.72 కోట్లు, ఒప్పంద ఉద్యోగి కుటుంబానికి రూ. 45 లక్షలు అందుతాయని వివరించారు. మృతుడు శాశ్వత ఉద్యోగి అయినా, ఒప్పంద ఉద్యోగి అయినా వారి కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పిస్తామని, వారి పిల్లల చదువుల బాధ్యతను కూడా ప్రభుత్వమే తీసుకుంటుందని హామీ ఇచ్చారు.ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపేందుకు కేంద్ర ఉక్కుశాఖ ఇప్పటికే త్రిసభ్య కమిటీని నియమించింది. బొకారో సెయిల్ డైరెక్టర్ ప్రియరంజన్ నేతృత్వంలోని ఈ కమిటీ ప్రమాద స్థలాన్ని పరిశీలించింది. మరో రెండు రోజుల పాటు విశాఖలోనే ఉండి ప్రమాదానికి గల కారణాలను శోధించనుంది. ఈ దుర్ఘటన కారణంగా స్టీల్‌ప్లాంట్‌కు భారీ ఆర్థిక నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. రెండు రోజుల పాటు ఉత్పత్తి నిలిచిపోవడంతో సుమారు రూ. 100 కోట్లు, యంత్ర పరికరాలు దెబ్బతినడం వల్ల మరో రూ. 20 కోట్లు, మొత్తంగా రూ. 120 కోట్లకు పైగా నష్టం జరిగిందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎస్ఎంఎస్-1లోని ఒక మిషన్ ఆగిపోగా, మిగిలిన ఐదు మిషన్లతో ఉత్పత్తిని పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# ఉత్తర, దక్షిణ విభజన, తెలంగాణ ఏర్పాటుకు వ్యతిరేకతపై పవన్ కల్యాణ్ స్పందన

- **ఉత్తర-దక్షిణ విభజన వాదం దేశానికి ప్రమాదకరమని పవన్ హెచ్చరిక**
- **తొలిసారిగా ఏఎన్ఐకి ఇచ్చిన పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు**
- **రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టవద్దు**
- **ఏపీకి రూ.7,707 కోట్లు కేటాయించిన కేంద్రానికి ధన్యవాదాలు**
- **తాను తెలంగాణను ఎప్పుడూ వ్యతిరేకించలేదన్న పవన్ కల్యాణ్**
- **విభజన జరిగిన తీరును మాత్రమే వ్యతిరేకించినట్లు వెల్లడి**



ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టే ధోరణులు దేశ సమగ్రతకు అత్యంత ప్రమాదకరమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా హెచ్చరించారు. ఇలాంటి విభజనవాద ధోరణులు దేశ శ్రేయస్సుకు ఏమాత్రం శ్రేయస్కరం కావని ఆయన స్పష్టం చేశారు. తాను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఎన్నడూ వ్యతిరేకించలేదని, కేవలం విభజన జరిగిన అశాస్త్రీయ విధానాన్ని మాత్రమే తప్పుబట్టానని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.తొలిసారిగా ఆయన ఢిల్లీలో ఏఎన్ఐ వార్తాసంస్థ ఎడిటర్ స్మితా ప్రకాశ్‌తో నిర్వహించిన పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజకీయాలు, పరిపాలన, వ్యక్తిగత అంశాలతో పాటు పలు జాతీయ అంశాలపై ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు.సుమారు 84 నిమిషాల పాటు సాగిన ఈ ఇంటర్వ్యూలో పవన్ మాట్లాడుతూ, రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న నాయకులు ఒక ప్రాంతాన్ని మరో ప్రాంతంతో పోల్చి ప్రజల మధ్య వైషమ్యాలు పెంచడం సరికాదన్నారు. గతంలో కొందరు నేతలు తనను హైదరాబాద్ రావొద్దని అన్నారని గుర్తుచేస్తూ, అదే తర్కాన్ని పాటిస్తే రాహుల్ గాంధీ వంటి జాతీయ నాయకులను కూడా కొన్ని ప్రాంతాలకు వెళ్లవద్దని చెప్పాల్సి ఉంటుందని, ఇటువంటి సంకుచిత రాజకీయాలు దేశానికి తగవని హితవు పలికారు. 570కి పైగా సంస్థానాలను విలీనం చేసి భారతదేశాన్ని పటిష్టం చేసిన చరిత్రను స్మరిస్తూ, విభజనవాదం దేశ ఐక్యతకు గొడ్డలిపెట్టు అని ఆయన అభిప్రాయపడ్డారు.'వీబీ జీ రామ్ జీ' పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ.7,707.21 కోట్లు కేటాయించినందుకు పవన్ కల్యాణ్ కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. దేశవ్యాప్తంగా రాష్ట్రాలకు అందిన నిధుల్లో ఇది మూడో అత్యధిక కేటాయింపు అని ఆయన పేర్కొన్నారు. ఈ నిధుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడటంతో పాటు ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నదే తన ఆకాంక్ష అని పవన్ కల్యాణ్ తెలిపారు. తెలంగాణలో కూడా తమ పార్టీ పోటీ చేయాలని పార్టీ శ్రేణులు కోరుతున్నారని వెల్లడించారు. ఈ దేశంలో పౌరులు ఎవరైనా, ఎక్కడికైనా వెళ్లే స్వేచ్ఛ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ ఇంటర్వ్యూలో భాగంగా తెలంగాణపై తన భవిష్యత్ ప్రణాళికలు, ఆధ్యాత్మిక విశ్వాసాలు, ఉచిత పథకాల ప్రభావం, భాషా రాజకీయాలు, ఐటీ రంగంలో ఉద్యోగాల కల్పన వంటి అనేక అంశాలపై పవన్ తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఎన్డీయే సమావేశాల నిమిత్తం ఢిల్లీలో ఉన్న తరుణంలో ఆయన ఈ పాడ్‌కాస్ట్‌లో పాల్గొనడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జూపల్లి

- **మినీ స్టేడియం కోసం సొంత భూమి విరాళం!**
- **గతంలో వీపనగండ్ల వెళ్లినప్పుడు మినీ స్టేడియం కావాలని జూపల్లిని అడిగిన స్థానిక యువత**
- **తన సొంత భూమి ఇస్తానని నాడు మాట ఇచ్చిన జూపల్లి**
- **రూ. 1.50 కోట్లకు పైగా విలువున్న భూమిని విరాళంగా ఇచ్చిన మంత్రి**



రాజకీయాల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే నేతలు చాలా అరుదుగా ఉంటారు. అలాంటి వారిలో తాను ఒకడినని నిరూపించుకున్నారు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు. యువత, క్రీడాకారుల భవిష్యత్తు కోసం ఆయన ఒక అద్భుతమైన నిర్ణయం తీసుకున్నారు. మినీ స్టేడియం నిర్మాణం కోసం తన సొంత భూమిని కేటాయిస్తూ బుధవారం అధికారికంగా డిజిటల్ సంతకాలు చేశారు.గతంలో వీపనగండ్ల మండల పర్యటనకు వెళ్లిన సమయంలో.. అక్కడ స్థానిక యువత, క్రీడాకారులు తమకు ఒక మినీ స్టేడియం కావాలని మంత్రి జూపల్లిని అభ్యర్థించారు. వారి కోరికపై సానుకూలంగా స్పందించిన మంత్రి, స్టేడియం నిర్మాణం కోసం తన సొంత భూమిని ఇస్తానని నాడు మాట ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీని నెరవేరుస్తూ.. వీపనగండ్ల మండల కేంద్రంలోని సర్వే నెం. 532/ఆ లో తన పేరిట ఉన్న 4 ఎకరాల భూమిని క్రీడాకారుల అభివృద్ధి కోసం అందజేశారు.నాగర్‌కర్నూల్ జిల్లా కోడేర్ మండల తహశీల్దార్ కార్యాలయంలో ఈ భూ బదిలీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా పూర్తయింది. వీపనగండ్ల మండల తహశీల్దార్ లాగిన్ ద్వారా నిర్వహించిన ఈ ఆన్‌లైన్ ప్రక్రియలో మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా డిజిటల్ సంతకం చేసి భూమిని ప్రభుత్వానికి బదిలీ చేశారు. మంత్రి కేటాయించిన ఈ నాలుగు ఎకరాల భూమి ప్రస్తుత మార్కెట్ విలువ సుమారు రూ.1.50 కోట్లకు పైగానే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఈ చారిత్రాత్మక భూ బదిలీ ప్రక్రియకు సాక్షులుగా కాంగ్రెస్ నాయకుడు మునిగొండ గోపి, జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ డిజిటల్ సంతకాలు చేశారు.మంత్రి తీసుకున్న ఈ ఉదార నిర్ణయంపై వీపనగండ్ల మండల ప్రజలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత యువత, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మినీ స్టేడియం అందుబాటులోకి వస్తే.. గ్రామీణ ప్రాంతాల్లోని అద్భుతమైన ప్రతిభ గల యువకులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగేందుకు ఒక గొప్ప వేదిక లభిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



# బీజేపీ ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తోంది

## ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు బీజేపీ కుట్రలు

## పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు




**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 10 (వార్త సంధ్య) :** ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా, రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేసేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను అక్రమంగా తిరస్కరించడం ప్రజాస్వామ్య వ్యవస్థపై జరుగుతున్న దాడికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. అధికార అహంకారంతో విపక్షాల గొంతు నొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ప్రశ్నించే స్వరాలపై కక్షసాధింపు చర్యలకు బీజేపీ పాల్పడుతోందని ఆరోపించారు. సాధారణ జీవనం గడిపే, గాంధేయవాద భావజాలం కలిగిన, నిజాయితీ మరియు నిబద్ధతతో ప్రజాసేవ చేస్తున్న మహిళా నాయకురాలికి రాజ్యసభలో ప్రవేశించే అవకాశాన్ని అడ్డుకోవడం ముందస్తు కుట్రలో భాగమేనని ఆయన అభిప్రాయపడ్డారు. కనీసం వివరణ కోరే అవకాశం ఇవ్వకుండా, ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే నామినేషన్‌ను తిరస్కరించడం ఎన్నికల నిర్వహణ పారదర్శకతపై అనుమానాలు కలిగిస్తోందన్నారు. స్వయం ప్రతిపత్తి కలిగిన ఎన్నికల కమిషన్‌ను కలిసేందుకు కూడా అనుమతి నిరాకరించడం ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిని బహిర్గతం చేస్తోందని విమర్శించారు. మహిళా సాధికారత గురించి మాట్లాడే బీజేపీ, ఒక మహిళా నాయకురాలు రాజ్యసభ స్థానానికి పోటీ చేయడాన్ని అడ్డుకోవడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే, ఎన్నికల వ్యవస్థల విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేసే ఇటువంటి చర్యలను దేశ ప్రజలు గమనిస్తున్నారని, బీజేపీ నియంతృత్వ పోకడలకు ప్రజలే తగిన సమయంలో గుణపాఠం చెబుతారని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా ఖండించారు.


# నూతన బస్ స్టాండ్ నిర్మాణం చేపట్టాలి

## తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ధర్నా



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 10 (వార్త సంధ్య) :** మణుగూరు పట్టణంలో నూతన బస్ స్టాండ్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, లక్ష జనాభా కలిగిన మణుగూరు పట్టణ ప్రజల రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని మాజీ శాసనసభ్యుడు రేగా కాంతారావు ప్రత్యేక చొరవతో రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయించారని తెలిపారు. అప్పటి రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చేతుల మీదుగా భూమిపూజ కార్యక్రమం నిర్వహించినప్పటికీ నేటి వరకు నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా అవసరాలను విస్మరించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. మణుగూరు ప్రజల చిరకాల కోరిక అయిన నూతన బస్ స్టాండ్ నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పనులను రాజకీయ కోణంలో చూడకుండా ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం స్పందించాలని కోరారు. లేకుంటే ప్రజలను కలుపుకుని మరింత ఉధృతంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# నిందితుడికి కఠిన శిక్ష ఖాయం : మంత్రి పొంగులేటి




**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 10 (వార్త సంధ్య) :** ఖమ్మం నగరంలో ఓ బాలికపై జరిగిన అమానుష దాడి, హత్యాయత్నం ఘటనపై రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన సమాజం తలదించుకునేలా ఉందని, బాలికపై దాడికి పాల్పడిన నిందితుడిని చట్టపరంగా అత్యంత కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తల్లంపాడు గ్రామానికి చెందిన రేగళ్ల రమేశ్ కుమార్తెపై జరిగిన ఈ ఘాతుకం తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, కేసు దర్యాప్తును వేగవంతం చేసి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. మహిళలు, బాలికలపై జరిగే నేరాల విషయంలో ప్రభుత్వం ఏమాత్రం ఉపేక్షించదని, నేరస్తులకు చట్టం ప్రకారం కఠిన శిక్షలు తప్పవని మంత్రి హెచ్చరించారు.

# సీ.ఎం.రిలీఫ్ ఫండ్‌తో పేదలకు అండగా నిలుస్తున్నాం:ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్ రెడ్డి



**ఎల్బీనగర్ ప్రతినిధి, జూన్ 10 (వార్త సంధ్య):** ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని లింగోజిగూడ డివిజన్ పరిధిలోని గ్రీన్ పార్క్ కాలనీ నందు నివాసం ఉంటున్న మీణు మెదడుకు సంబంధించి పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండగా వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో వారి కుటుంబసభ్యులు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుదీర్ రెడ్డి ని సంప్రదించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి వారి వైద్య చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా దరఖాస్తు చేయించారు. దీనికి సంబంధించి నాలుగు లక్షల రూపాయల ఎల్.ఓ.సీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరు కాగా బాధిత కుటుంబసభ్యులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేయడం ద్వారా మాకు ఎంతో సంతృప్తి లభిస్తుంది. నా 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎంతోమంది పేద ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కింది" అని పేర్కొన్నారు. బాధిత తండ్రి కాశీనాథ్ గౌడ్ మాట్లాడుతూ మా కుతురు ఆరోగ్య సమస్య విషయంలో సుదీర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సహాయం అందించడం ఎంతో ఆనందంగా ఉందని, ఆయనకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ భారస నాయకులు మహేష్ రెడ్డి,అనిల్ యాదవ్,అంజయ్య గౌడ్,మధుసూదన్,మనీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచలో ఘోర రోడ్డు ప్రమాదం.. మూడేళ్ల చిన్నారి మృతి



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 10 (వార్త సంధ్య) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీ సమీపంలో బుధవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రహదారి పక్కన ఆగి ఉన్న లారీలను ఓ కారు ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న మూడేళ్ల చిన్నారి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో మరో ముగ్గురు తీవ్రంగా గాయపడగా, వారిని స్థానికులు వెంటనే పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదానికి గురైన వారు మధిర ప్రాంతానికి చెందిన వైద్యుల కుటుంబ సభ్యులుగా గుర్తించినట్లు సమాచారం. మధిర నుంచి భద్రాచలం వైపు వెళ్తుండగా ఈ విషాద ఘటన చోటుచేసుకున్నట్లు ప్రాథమిక సమాచారం వెల్లడిస్తోంది. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


# అన్నపురెడ్డిపల్లి లో కల్తీ ఆహారం దందా....!

## తనిఖీలు ముమ్మరం చేయాలని డిమాండ్


## ఆహార పదార్థాల నాణ్యతపై గ్రామస్థుల్లో ఆందోళన

## గడువు ముగిసిన ఉత్పత్తుల విక్రయాలపై ప్రజల్లో అనుమానాలు

## వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఎక్కడ?




**చంద్రుగొండ ప్రతినిధి , జూన్ 10 (వార్త సంధ్య) :** అన్నపురెడ్డిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న కొన్ని కిరాణా దుకాణాలు, ఆహార పదార్థాల విక్రయ కేంద్రాలు మరియు ఇతర వ్యాపార సంస్థల పనితీరుపై స్థానిక ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఆహార పదార్థాల నాణ్యత, గడువు తేదీలు, ధరల అమలు, అనుమతులు మరియు నిబంధనల పాటింపు వంటి అంశాలపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామంలో విక్రయిస్తున్న కొన్ని ఉత్పత్తులపై సరైన తనిఖీలు జరగడం లేదని, సంబంధిత శాఖల అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఫలితంగా వినియోగదారుల హక్కులు దెబ్బతింటున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా నిత్యావసర వస్తువులు, ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలు, శీతల పానీయాలు మరియు ఇతర వినియోగ వస్తువుల నాణ్యతపై సందేహాలు తలెత్తుతున్నాయని పేర్కొంటున్నారు. కొన్ని వ్యాపార సంస్థల్లో గడువు ముగిసిన ఉత్పత్తులు విక్రయిస్తున్నారనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా ఎటువంటి నిర్ధారణ లేకపోవడంతో సంబంధిత శాఖలు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలికితీయాలని గ్రామస్థులు కోరుతున్నారు. అలాగే ప్రతి దుకాణంలో ధరల పట్టికలు, లైసెన్సులు, ఆహార భద్రత అనుమతులు స్పష్టంగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆహార భద్రతా శాఖ, పౌర సరఫరాల శాఖ, తూనికలు-కొలతల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గ్రామంలో వ్యాపార కార్యకలాపాలపై సమగ్ర పరిశీలన జరిపి వినియోగదారుల ప్రయోజనాలను కాపాడాలని కోరుతున్నారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో కల్తీ ఆహార పదార్థాలు, గడువు ముగిసిన వస్తువుల విక్రయాలు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో అన్నపురెడ్డిపల్లిలో కూడా సంబంధిత శాఖలు అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రజలు సూచిస్తున్నారు. ప్రజల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి పారదర్శక వ్యవస్థను అమలు చేయాలని కోరుతున్నారు. ఈ అంశంపై సంబంధిత అధికారుల స్పందన ఇంకా తెలియరాలేదు. గ్రామంలో వినియోగదారుల నుంచి వ్యక్తమవుతున్న ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.







# మొన్నటిదాకా ఓట్ చోరీ.. ఇప్పుడు ఏకంగా సీట్ చోరీ!

## మోదీ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోంది

## కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ ఫైర్



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 10 (వార్త సంధ్య) :** మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ పత్రాలను తిరస్కరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమైన చర్య అని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేటర్, కాంగ్రెస్ నాయకురాలు ఆకునూరి సుప్రియ విమర్శించారు. ఈ మేరకు ఆమె బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేవలం ఒక ప్రైవేట్ ఫిర్యాదు దాఖలైనంత మాత్రాన అది క్రిమినల్ కేసుగా పరిగణించబడదని, సంబంధిత న్యాయస్థానం దానిని పరిగణనలోకి తీసుకున్న తర్వాత మాత్రమే చట్టపరమైన ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆమె పేర్కొన్నారు. అలాంటి పరిస్థితి కూడా లేకుండానే మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించడం చట్టబద్ధతపై తీవ్ర అనుమానాలకు తావిస్తోందన్నారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీలో ఎమ్మెల్యేల సంఖ్యను పరిశీలిస్తే బీజేపీకి రెండు రాజ్యసభ స్థానాలు మాత్రమే దక్కే అవకాశం ఉందని, అయినప్పటికీ ముందుగానే మూడో అభ్యర్థిని బరిలోకి దింపడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ప్రత్యర్థి అభ్యర్థిని పోటీ నుంచి తప్పించేందుకు అధికార యంత్రాంగాన్ని ఉపయోగించారనే సందేహాలు ప్రజల్లో నెలకొన్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి అభ్యర్థికి సమాన అవకాశాలు కల్పించడం ఎన్నికల వ్యవస్థ బాధ్యత అని, కానీ అధికార బలంతో ప్రతిపక్షాల హక్కులను కాలరాస్తూ ఎన్నికల ప్రక్రియను తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారుతున్నాయని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాల్సింది పోయి, ప్రతిపక్షాలను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా పనిచేస్తోందనే విమర్శలకు ఈ ఘటన మరింత బలం చేకూర్చిందన్నారు. మొన్నటిదాకా "ఓట్ చోరీ" ఆరోపణలు ఎదుర్కొన్న బీజేపీ, ఇప్పుడు ఏకంగా "సీట్ చోరీ"కి పాల్పడుతోందనే అభిప్రాయం దేశవ్యాప్తంగా వ్యక్తమవుతోందని వ్యాఖ్యానించారు. కేంద్ర ఎన్నికల సంఘం వెంటనే ఈ అంశంపై జోక్యం చేసుకుని న్యాయబద్ధంగా విచారణ జరిపి, మీనాక్షి నటరాజన్‌కు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే కుట్రలను దేశ ప్రజలు ఎప్పటికీ క్షమించరని, అధికార దుర్వినియోగంతో సాధించే విజయాలు తాత్కాలికమేనని, చివరికి రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ప్రజల తీర్పే గెలుస్తాయని ఆకునూరి సుప్రియ పేర్కొన్నారు.

# మొక్కలు నాటి మత్తు రహిత సమాజం కోసం పిలుపు

## ఈగల్ టీం అవగాహన కార్యక్రమం






**మధిర ప్రతినిధి, జూన్ 10 (వార్త సంధ్య) :** ప్రజా పాలన -- పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా మధిరలోని షేర్ చేయూత మత్తు పదార్థాల పునరావాస కేంద్రంలో బుధవారం మొక్కలు నాటుతూ మత్తు రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఈగల్ టీం పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో మధిర పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఈగల్ టీం సబ్ ఇన్‌స్పెక్టర్ రవి ప్రసాద్ పాల్గొని మొక్కలు నాటారు. సీఐ రమేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతలను గుర్తుంచుకుని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. యువత ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకుని కుటుంబం, సమాజం అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు మత్తు రహిత సమాజ నిర్మాణం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈగల్ టీం ఎస్ఐ రవి ప్రసాద్ మాట్లాడుతూ గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగం, నిల్వ, అక్రమ రవాణా వంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా మాదక ద్రవ్యాల వినియోగం లేదా అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే ఈగల్ సిబ్బందికి తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారందరి చేత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని, ఇతరులను కూడా చైతన్యపరుస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ యెన్నం కోటేశ్వరరావు, దోర్నాల రవి, కృష్ణ, షేర్ సంస్థ సిబ్బంది, జీలుగుమాడు గ్రామ పెద్దలు, పునరావాస కేంద్ర సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# స్మశానవాటిక రహదారికి సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభం

## భట్టి విక్రమార్క కృషితో నిర్మాణానికి శంకుస్థాపన



**మధిర ప్రతినిధి, జూన్ 10 (వార్త సంధ్య) :** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో మధిర మున్సిపాలిటీ పరిధిలోని ఇల్లెందులపాడు గ్రామంలో హిందూ స్మశానవాటికకు వెళ్లే రహదారిని సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయనున్న పనులకు బుధవారం శంకుస్థాపన నిర్వహించారు. ప్రజల అవసరాలను గుర్తించి గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు భట్టి విక్రమార్క కట్టుబడి పనిచేస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మధిర నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమయ్యాయని, ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. గ్రామీణ రహదారులు, తాగునీటి సౌకర్యాలు, విద్యుత్, స్మశానవాటికలు, విద్యా మరియు వైద్య రంగాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని పేర్కొన్నారు. భట్టి విక్రమార్క కృషితో మంజూరైన నిధులతో చేపడుతున్న ఈ సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మధిర మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సామినేని సుజాత, ప్రముఖ వైద్యులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మధిర మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కోనాధని కుమార్, డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మిర్యాల వెంకటరమణ గుప్తా, రంగా శ్రీనివాసరావు, తన్నీరు రామకృష్ణ, కరివేద సుధాకర్, ఈది అనిల్, మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు, మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయ్ కుమార్, సామినేని రామనాథం, బోడేపూడి గోపి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రూ.3 కోట్ల అభివృద్ధి పనులను పరిశీలించిన సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్






**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 10 (వార్త సంధ్య) :** ఖమ్మం నగరంలోని పాండురంగాపురం (డివిజన్-02), బల్లేపల్లి (డివిజన్-03), లోటస్ హిల్స్ (డివిజన్-16) ప్రాంతాల్లో సుడా నిధులతో చేపడుతున్న రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ మూడు డివిజన్లలో సుమారు రూ.3 కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. పనుల నాణ్యత, నిర్మాణ ప్రమాణాలు, పనుల వేగవంతమైన అమలుపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సుడా ఇంజినీరింగ్ అధికారులతో కలిసి నిర్మాణ పనుల వివరాలను పరిశీలించారు. సూపరింటెండింగ్ ఇంజినీర్ రంజిత్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కృష్ణలాల్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ధరణి, అసిస్టెంట్ ఇంజినీర్లు యాకూబ్ వలి, తేజా తదితరులు పనుల పురోగతిపై వివరాలు అందించారు. స్థానిక ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందేలా పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సుడా చైర్మన్ అధికారులను ఆదేశించారు. నగర అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు సుడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ పేదల పొట్టకొడుతున్న కేంద్రం

## సామాన్యులపై అదనపు భారాలు మోపడం దుర్మార్గం

## పెంచిన ఇంధన, గ్యాస్ ధరలతో పేదోడి నడ్డివిరుస్తున్న కేంద్ర సర్కార్

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు







**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 10 (వార్త సంధ్య) :** కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ కేంద్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి వర్గాల పొట్టకొడుతుందని, ప్రజలపక్షాన ఉద్యమాల ఉధృతిని పెంచి పాలకులకు కళ్ళు తెరిపిస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పెంచిన ఇంధన ధరలు తగ్గించాలని, నిత్యావసరాల ధరలను పేదలకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం సామాన్య ప్రజలపై అదనపు భారాలు మోపడం దుర్మార్గమన్నారు. పెంచిన ఇంధన, గ్యాస్ ధరలతో పేదోడి నడ్డివిరుస్తున్న కేంద్ర సర్కార్, ధనవంతులకు ఊడిగం చేస్తూ దేశ సంపదను దోచిపెడుతోందని మండిపడ్డారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతుంటే పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రానికి రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. పేద, మధ్యతరగతి ప్రజల ప్రయోజనాలను పణంగా పెడుతున్న పాలకుల తీరుపై రాజీలేని పోరాటాలు చేస్తామని, తక్షణమే పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో ప్రతిఘటన ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, మేయర్ మూడ్ గణేష్, జిల్లా నాయకులు నరాటి ప్రసాద్, సలిగంటి శ్రీనివాస్, సరెడ్డి పుల్లారెడ్డి, కె సారయ్య, మున్నా లక్ష్మి కుమారి, చంద్ర నరేంద్ర కుమార్, వి పూర్ణచందర్ రావు, జి వీరాస్వామి, కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, రేసు ఎల్లయ్య, మువ్వా వెంకటేశ్వర్ రావు, భూక్యా దస్రు, యు రాహుల్, ఎస్ కె ఫహీమ్, మండలాల కార్యదర్శులు, జిల్లా సమితి సభ్యులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## మోదీ 4399 రోజుల చారిత్రాత్మక పాలనకు గుర్తుగా భద్రాచలంలో ప్రత్యేక పూజలు




**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 10 (వార్త సంధ్య) :** ప్రధాని నరేంద్ర మోదీ 4399 రోజుల నిరంతర ప్రధానమంత్రి పదవీకాలాన్ని పూర్తి చేసిన సందర్భంగా భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తెలంగాణ టూరిజం హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీజేపీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి, సంక్షేమం, మౌలిక సదుపాయాలు, డిజిటల్ రంగాల్లో విశేష పురోగతి సాధించిందన్నారు. ప్రపంచ వేదికపై భారతదేశ ప్రతిష్ఠ పెరిగిందని పేర్కొన్నారు. 2047 నాటికి "వికసిత భారత్" లక్ష్య సాధన కోసం మోదీ కృషి చేస్తున్నారని, ఆయనకు ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుంజా ధర్మా, కుంజా సంతోష్, కురిచేటి రామచంద్రమూర్తి, నిడదవోలు నాగబాబు, ములిశెట్టి రాంమోహన్ రావు తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత అందరి బాధ్యత

### ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ

### ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 10 (వార్త సంధ్య) :** రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి ప్రాణాలకు రక్షణగా నిలిచే అత్యంత ముఖ్యమైన అంశమని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కూసుమంచి మండలం నాయకులగూడెం గ్రామంలోని పీవీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన గ్రామసభలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా ఐఎస్ఐ ప్రమాణాల హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీట్ బెల్ట్ వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. వాహనాలను పరిమిత వేగంతో నడపాలని, ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు సూచికలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. పాదచారులకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, పీయూసీ పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఇటీవల కూసుమంచి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదాల బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ధర్మ తండాకు చెందిన రోడ్డు ప్రమాద బాధితుడు సందీప్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు.

## రాష్ట్రంలోని ఉపసర్పంచుల మనోభావాలను ఆవేదనను ఆత్మ గౌరవాన్ని మీ ముందు పెడుతున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గిరిజన ఉప సర్పంచ్ ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోతు సురేష్ నాయక్ కోరారు






**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జూన్ 10) :** బుధవారం నాడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో గ్రామపంచాయతీలు అన్ని ఇది ప్రజలకు అత్యంత దగ్గరైన పాలన వ్యవస్థ అని గ్రామాభివృద్ధి ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమల్లో ఉపసర్పంచ్ లో పాత్ర కీలకంగా ఉన్నదని చెప్పారు ఇటీవల ఉపసర్పంచ్ లకు చెక్ పవర్ తొలగించే నిర్ణయంగా రాష్ట్రవ్యాప్తంగా ఉప సర్పంచులు తీవ్ర ఆందోళన కలిగిస్తుందని ఆయన అన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప సర్పంచ్లకు చెక్ పవర్ తీసేద్దామని ఆయన కోరారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయడం లేదని తాము ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేస్తున్నామని ఆయన తెలిపారు ఈ సమావేశంలో రాష్ట్ర ఉప సర్పంచ్ లసంఘం నేతలు బానోత్ సురేష్ నాయక్ భూక్య జయంతి లాల్ నర్సింలు తదితరులు పాల్గొని ప్రసంగించారు ప్రభుత్వం ఉప సర్పంచ్ లకు చెక్ పవర్ ను తీసివేయవద్దని ప్లే కార్డుల ప్రదర్శన చేశారు

## ఓటర్ నమోదు ప్రక్రియ పూర్తి గా పారదర్శకంగా నిర్వహించాలి




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)జూన్ 10 :** ఈనెల 25 నుండి ప్రారంభం కానున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఐటి విరివిగా వాడుకోని ఓటరు నమోదు ప్రక్రియలో పూర్తి పారదర్శకంగా ఎలాంటి తప్పులకు తావివకుండా ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారి శ్రీ సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఐటి వినియోగంపై జిల్లా, మండల స్థాయి మాస్టర్ ట్రైనర్స్, ఐటి సపోర్ట్ టీం, డేటా ఆపరేటర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో ఐటి అంశం అత్యంత కీలకమైనదని, దానిని సిబ్బంది విరివిగా వాడుకొని ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం, సమర్థవంతంగా చేపట్టేందుకు దోహదపడుతుందని, అంతేకాకుండా ఓటరు జాబితా రూపొందించడంలో పారదర్శకత ఉంటుందని తెలిపారు. అలాగే ఓటర్లు ఆన్ లైన్ ద్వారా తమ పేరును ఎన్యుమరేషన్ చేసుకోవడానికి జశీవతీ.వఎఱ.స్త్రశీజ.ఱఅ వెబ్ సైట్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భ ా ర త్ ఎన్నికల కమిషన్ ఐటికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చే అందుబాటులోకి తెచ్చిందని, దీంతో ఎస్ఐఆర్ ప్రక్రియ మరింత సులభతరం చేసేందుకు ఇందులో వివిధ టూల్స్ను పొందుపరిచిందని, వీటిని ఉపయోగించడంపై మాస్టర్ ట్రైనర్లు, ఐటి సపోర్ట్ టీమ్ లు క్షేత్రస్థాయిలో డేటా ఆపరేటర్లకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఆన్ లైన్ ద్వారా ఓటర్లను ఎన్యుమరేషన్ చేసుకునేందకు సదుపాయం కల్పించినందున దీనిపై అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను సిఇఒ ఆదేశించారు. అనంతరం రాష్ట్ర శిక్షణ నోడల్ అధికారి బి. చెన్నయ్య, ఎస్ఐఆర్ ప్రక్రియలోని వివిధ దశలను సవివరంగా వివరించారు. పీఎం-ఐటీ శ్రీ డి. చిరంజీవి, ఈసీఐనెట్ బీఎల్ఓ యాప్‌కు సంబంధించిన సాంకేతిక శిక్షణను అందించారు. ఇందులో ఎన్యూమరేషన్ ఫారమ్‌లను పూరించడం, ఓటర్ల మ్యాపింగ్, సేకరించలేని ఎన్యూమరేషన్ ఫారమ్‌ల వర్గీకరణ, అలాగే ఇతర అనుబంధ కార్యకలాపాల విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఐఏఎస్, ఉప ప్రధాన ఎన్నికల అధికారి (ఎఫ్ఏసీ) శ్రీ ఎ.ఎస్. చారిలతో పాటు నోడల్ అధికారులు, సంబంధిత సిబ్బంది కూడా పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులను ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి: డాక్టర్ పిడమర్తి రవి



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జూన్ 10. :** జూన్ 21 హైదరాబాద్ లో ఇందిరా పార్క్ దగ్గర చేపట్టిన తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమ కారుల సంఘం వ్యవస్థాపకులు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. తెలంగాణ ఉద్యమకానుల ఆత్మీయ సమ్మేళన సన్నాహక సమావేశంలో భాగంగా ఈరోజు షాద్నగర్ మహబూబ్నగర్ కొల్లాపూర్ నియోజకవర్గంలో పర్యటించి తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం పెన్షన్ గుర్తింపు కార్డు ఇవ్వాలని ఉత్తమకారుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు తెలంగాణ ఉద్యమంలో అనేకమంది గాయపడి వికలాంగులుగా మారారు కాబట్టి వారందరికీ తెలంగాణ ఉద్యమకారులకు ఇవ్వవలసిన సంక్షేమ ఫలాలు అన్ని ఇవ్వవలసిందిగా విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమకారులను వెంటనే గుర్తింపు ప్రక్రియ చేపట్టాలని పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులను ఎండి రహీం, బి ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బోరెల్లి సురేష్,బొర్రా సురేష్, అన్వర్, పోలే నరేందర్,యాదన్న,గడ్డమీద గోపాల్,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మరుల ఐక్యతకు కనగల్లు వేదిక...

## నల్లగొండ సభ విజయానికి కరపత్ర ఆవిష్కరణ - గ్రామ అధ్యక్షుల ఏకగ్రీవ ఎన్నిక



**నల్గొండ :కనగల్లు, జూన్ -10 (వార్త సంధ్య :)** తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న సంఘ బలోపేత కార్యక్రమాలు మరింత ఊపందుకున్నాయి. రానున్న నల్లగొండ నియోజకవర్గ మహాసభను విజయవంతం చేయాలనే లక్ష్యంతో కనగల్లు మండలంలో ఈరోజు ఘనంగా కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అదే సందర్భంగా సంఘ విస్తరణలో భాగంగా రెండు గ్రామాలకు అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.నల్లగొండ జిల్లాలోని ఆరు నియోజకవర్గాలు, 33 మండలాల్లో కుమ్మరులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి వారి సమస్యల పరిష్కారం, వృత్తి అభివృద్ధి, రాజకీయ-సామాజిక ప్రాధాన్యత పెంపు కోసం తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం నిరంతరం కృషి చేస్తోంది. ఇప్పటికే నాలుగు నియోజకవర్గాల్లో భారీ స్థాయిలో సభలను నిర్వహించి విజయవంతం చేసిన సంఘం, మిగిలిన దేవరకొండ మరియు నల్లగొండ నియోజకవర్గ సభలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేపట్టింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జూన్ 30, 2026న దేవరకొండ నియోజకవర్గ సభ, జూలై 5, 2026న నల్లగొండ నియోజకవర్గ సభ నల్లగొండ పట్టణంలోని ముష్యంపెల్లి రోడ్డులో గల అశోక గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభలకు జిల్లావ్యాప్తంగా పెద్ద సంఖ్యలో కుమ్మరులు హాజరై సంఘ బలోపేతానికి తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.నల్లగొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్, జిల్లా ప్రచార కార్యదర్శి నిమ్మనగోటి శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కనగల్లు మండలంలోని గ్రామాల్లో సంఘాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో గ్రామ కమిటీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.అందులో భాగంగా కనగల్లు గ్రామ అధ్యక్షుడిగా నీలకంఠం వెంకన్న (శంకరయ్య కుమారుడు),అమ్మగూడెం గ్రామ అధ్యక్షుడిగా మాచర్ల లక్ష్మీనారాయణ (పెద్ది రాములు కుమారుడు)లిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన అధ్యక్షుల ఎన్నిక సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి గ్రామ స్థాయిలో నాయకత్వం ఎంతో కీలకమని పేర్కొన్నారు. గ్రామాల్లోని ప్రతి కుమ్మరి కుటుంబాన్ని సంఘంతో అనుసంధానం చేసి వారి సమస్య లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు అధ్యక్షులు కృషి చేయాలని సూచించారు.కనగల్లు మండలంలో మొత్తం 31 గ్రామాలు ఉండగా,17 గ్రామాల్లో కుమ్మరి కుటుంబాలు నివసిస్తున్నాయని తెలిపారు. ఈ గ్రామాలన్నింటిలో సంఘ కమిటీలను ఏర్పాటు చేసి కుమ్మరులను సంఘటితం చేయడం ద్వారా వారి హక్కుల సాధనకు ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం మాట్లాడుతూ, కుమ్మరి సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సంఘం నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. సమాజ అభివృద్ధి, యువతకు అవకాశాలు, సంప్రదాయ వృత్తుల పరిరక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై సంఘం ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. రానున్న నల్లగొండ సభ కుమ్మరుల ఆత్మగౌరవ సభగా నిలవాలని, ప్రతి కుటుంబం తప్పనిసరిగా పాల్గొని సంఘ ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చిట్టిమల్ల దశరథ్, కంచర్ల రాము, మండల నాయకులు బొడ్డుపల్లి శీను, మునగాల నాగయ్య, నీలకంఠం శంకరయ్య, మాచర్ల నాగేష్, అనుముల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. సభ విజయవంతం కోసం గ్రామాల వారీగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తూ కుమ్మరులను చైతన్యపరచాలని నాయకులు నిర్ణయించారు.కరపత్ర ఆవిష్కరణతో పాటు గ్రామ అధ్యక్షుల ఎన్నికలు జరగడం కనగల్లు మండలంలో కుమ్మర సంఘానికి కొత్త ఉత్సాహాన్ని నింపగా, రానున్న నల్లగొండ నియోజకవర్గ మహాసభకు ఇది బలమైన పునాది అవుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## మదీనా బస్సు ప్రమాద బాధితులకు ఎక్స్‌గ్రేషియా చెక్కుల పంపిణీ




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూన్ 10 :** మదీనా బస్సు ప్రమాద బాధిత కుటుంబాలకు పెండింగ్ ఎక్స్‌గ్రేషియా చెక్కులను పంపిణీ చేసిన మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజహరుద్దీన్ తెలంగాణ రాష్ట్ర మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజహరుద్దీన్ బుధవారం సౌదీ అరేబియా రాజ్యంలో జరిగిన విషాదకర మదీనా బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం సచివాలయంలో నిర్వ హించ బడగా, నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్, తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రో పాషా, మైనారిటీల సంక్షేమ శాఖ కార్యదర్శి టీజీఎంఆర్ఈఐఎస్ కార్యదర్శి బి. షఫీఉల్లా, ఇతర అధి కారులు మృతుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మంత్రి మొహ మ్మద్ అజహరుద్దీన్ దివంగత మహమ్మద్ జాఫర్ మరియు దివంగత షేక్ సిరాజ్ కుటుంబ సభ్యులకు పరిహార చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, ఈ విషాద ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ప్రియమైన వ్యక్తిని కోల్పోయిన బాధను ఎలా ంటి ఆర్థిక సహాయం భర్తీ చేయలేదని అన్నారు.ప్రమాదం జరిగిన వెంటనే ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి బాధిత కుటుంబాలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకున్నారని మంత్రి తెలిపారు. మంత్రి మొహమ్మద్ అజహరుద్దీన్, ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్, ఉన్నతాధికారులు ప్రతినిధులతో కూడిన బృందం సౌదీ అరేబియాకు వెళ్లి బాధిత కుటుంబాలకు సహాయ సహ కారాలు అందించిందని పేర్కొన్నారు. బాధితుల కుటుంబ సభ్యులు సౌదీ అరేబియాకు వెళ్లేందుకు తెలం గాణ ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని, భారత కాన్సులేట్ మరియు సౌదీ అధికారులతో సమ న్వయం చేసి అంత్యక్రియలతో సహా అన్ని ఏర్పాట్లు గౌరవ ప్రదంగా పూర్తయ్యేలా చర్యలు తీసు కున్నామని మంత్రి తెలిపారు. మీడి యా తో భావోద్వేగంగా మాట్లాడిన మంత్రి మొహమ్మద్ అజహరుద్దీన్ , ఈ విషాదం సహాయక చర్యల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ తీవ్రంగా కలచివేసిందన్నారు. బాధిత కుటుంబాలకు అండగా నిల బడటంలో తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. మృతుల కుటుంబ సభ్యులు ముఖ్య మంత్రి ఏ. రేవంత్ రెడ్డి కి, మంత్రి మొహ మ్మద్ అజహరుద్దీన్ కి, ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ కి మరియు తెలంగాణ ప్రభుత్వానికి తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. క్లిష్ట సమయంలో అందించిన సహాయం, అంత్యక్రియల నిర్వహణలో చేసిన సహకారం మరియు నిరంతర మద్దతును వారు ప్రత్యేకంగా గుర్తు చేసుకున్నారు.మదీనా బస్సు ప్రమాదంలో మరణించిన ప్రతి కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం మానవతా దృక్పథంతో రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా సహాయాన్ని ప్రకటించిన విషయం విధితమే

## చౌడు నేలల పునరుద్ధరణకు జిప్సం వినియోగం

**90% సబ్సిడీపై రైతులకు జిప్సం సరఫరా**

**సమస్యాత్మక నేలలకు జిప్సం ఉత్తమ పరిష్కారం**

**వేరుశనగ, వరి పంటల్లో అధిక దిగుబడులకు జిప్సం దోహదం**

**కేవలం ?534 రైతు వాటాతో టన్ను జిప్సం అందుబాటులో**



హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూన్ 10. : భూసారాన్ని మెరుగుపరచడం, ఉప్పు ప్రభావిత (చౌడు) నేలలను సాగుకు అనుకూలంగా మార్చడం, వేరుశనగ, వరి వంటి పంటల్లో అధిక దిగుబడులు సాధించడం కోసం రైతులు జిప్సం వినియోగాన్ని పెంచాలని వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి, ఐఏఎస్ సూచించారు. రాష్ట్రంలో సాగునీటి విస్తరణ, అసమతుల్య ఎరువుల వాడకం, సరైన నీటి నిర్వహణ లేకపోవడం వంటి కారణాల వల్ల అనేక ప్రాంతాల్లో నేలల ఉప్పుదనం (చౌడు), క్షారత్వం పెరుగుతున్నదన్నారు. సాధారణంగా పీహెచ్ 8.2 కంటే ఎక్కువగా ఉన్న నేలలను క్షార నేలలుగా పరిగణిస్తారని తెలిపారు. ఇటువంటి నేలల్లో మొక్కలు నీరు, పోషకాలను సమర్థవంతంగా గ్రహించలేక దిగుబడులు తగ్గుతున్నాయని పేర్కొన్నారు. సమస్యాత్మక (చౌడు) నేలల పునరుద్ధరణకు జిప్సం వాడకం జిప్సం (కాల్షియం సల్ఫేట్)లో సుమారు 23--24 శాతం కాల్షియం, 18 శాతం గంధకం ఉండి ఇవి పంటలకు అత్యవసర ద్వితీయ పోషకాలుగా పనిచేస్తాయని వివరించారు. జిప్సం నేలలోని సోడియం అయాన్లను కాల్షియంతో మార్పిడి చేసి నేల గట్టిపడకుండా గుల్లగా మారుస్తుందని, దీని వల్ల నీరు భూమిలో లోతుగా ఇంకి వేర్ల పెరుగుదల మెరుగుపడుతుందని తెలిపారు. అలాగే నేలలోని ఉప్పుదనం తగ్గి పంటల పెరుగుదలకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని పేర్కొన్నారు.

### వేరుశనగ పంటలో జిప్సం ప్రాధాన్యత

వేరుశనగ పంటలో జిప్సం వినియోగం అత్యంత ప్రయోజనకరమని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారని తెలిపారు. వేరుశనగ కాయలు నిండుగా ఏర్పడటం, గింజలు గట్టిపడటం, నూనె శాతం పెరగడం, తాలుకాయలు తగ్గడం వంటి ప్రయోజనాలు కలుగుతాయని చెప్పారు. కాల్షియం లోపం ఉన్నప్పుడు ఆకులు ముడుచుకోవడం, వేర్ల పెరుగుదల తగ్గడం, పూతలు రాలిపోవడం, కాయల అభివృద్ధి మందగించడం జరుగుతుందని, గంధకం లోపంతో ఆకులు పసుపు రంగులోకి మారి మొక్క ఎదుగుదల తగ్గుతుందని వివరించారు. రైతులు వేరుశనగ పంటలో ఎకరాకు 200 కిలోల జిప్సంను తొలి పూత దశలో లేదా విత్తిన 45 రోజుల సమయంలో కలుపు తీసేటప్పుడు మొక్కల మొదళ్ల వద్ద వేయాలని సూచించారు. జిప్సం వేసిన అనంతరం మట్టిని మొక్కల వద్దకు ఎగదోయడం ద్వారా ఊడలు, కాయలు కాల్షియంను నేరుగా గ్రహించి దిగుబడి, నాణ్యత పెరుగుతాయని తెలిపారు.




### వరి పంటలో జిప్సం వినియోగంపై సూచనలు

అధిక సోడియం, అధిక పీహెచ్ ఉన్న చౌడు నేలల్లో వరి సాగుకు ముందు జిప్సం వినియోగం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ముఖ్యంగా గట్టి నేలలు, పగుళ్లు ఏర్పడే నల్లరేగడి నేలలు, నీరు నిల్వ ఉండే భూముల్లో జిప్సం వాడటం ద్వారా నేల నిర్మాణం మెరుగుపడుతుందని పేర్కొన్నారు.వరి సాగులో ఎకరాకు 100--200 కిలోల జిప్సంను చివరి దుక్కి సమయంలో సమానంగా చల్లి నేలలో 5--10 సెంటీమీటర్ల లోతు వరకు కలియదున్నాలని సూచించారు. అనంతరం మంచి నీటితో పొలాన్ని తడపడం ద్వారా నేలలోని అదనపు సోడియం బయటకు వెళ్లిపోతుందని తెలిపారు. డ్రై సీడెడ్ రైస్ పద్ధతిలో సాగు చేసే రైతులు భూమి సిద్ధం సమయంలోనే జిప్సంను ప్రాథమిక మోతాదుగా వినియోగించవచ్చని పేర్కొన్నారు. జిప్సం వాడకం వల్ల వరి పంటలో నీటి ఇంకుడు సామర్థ్యం పెరగడం, వేర్ల పెరుగుదల మెరుగుపడడం, గింజ నింపుదల బాగుండడం, అధిక దిగుబడులు రావడం వంటి ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. అలాగే నేలలో గాలి ప్రసరణ మెరుగై, నీరు నిల్వ సమస్య తగ్గుతుందని వివరించారు.

### జిప్సం వాడకం వల్ల కలిగే ప్రధాన ప్రయోజనాలు

చౌడు నేలల్లో సోడియం ప్రభావం తగ్గుతుంది ,నేల గట్టిపడకుండా గుల్లగా మారుతుంది, నీటి ఇంకుడు సామర్థ్యం పెరుగుతుంది, నేలలో గాలి ప్రసరణ మెరుగుపడుతుంది, కాల్షియం, గంధకం లభ్యత పెరుగుతుంది, నూనెగింజల పంటల్లో నూనె శాతం పెరుగుతుంది సూక్ష్మజీవుల కార్యకలాపాలు మెరుగుపడతాయి.

వరి పంటలో నీరు నిల్వ సమస్య తగ్గుతుంది, భూగర్భ జలాల నిల్వకు దోహదపడుతుంది అధిక సోడియం ఉన్న నేలల్లో జిప్సం వినియోగం ద్వారా నేల నిర్మాణం మెరుగుపడి సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు. నేల పరీక్షల ఆధారంగా తగిన మోతాదులో మాత్రమే జిప్సం వినియోగించాలని రైతులకు సూచించారు.

### 90% సబ్సిడీతో జిప్సం అందుబాటులో




రాష్ట్రంలో ఆర్‌కేవీవై సాయిల్ హెల్త్ అండ్ ఫెర్టిలిటీ కార్యక్రమం కింద చౌడు నేలల పునరుద్ధరణ కోసం రైతులకు జిప్సం 90 శాతం సబ్సిడీపై అందజేయబడుతోందని తెలిపారు. ఒక టన్ను జిప్సం పూర్తి ధర ?5,340 కాగా, ఇందులో 90 శాతం సబ్సిడీని ప్రభుత్వం భరిస్తోందని, రైతు వాటాగా కేవలం ?534 ప్రతి టన్నుకు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 11,500 మెట్రిక్ టన్నుల జిప్సం పంపిణీకి ప్రణాళిక రూపొందించగా, ఇప్పటివరకు 4,500 మెట్రిక్ టన్నుల జిప్సంను రైతులకు పంపిణీ చేయడం జరిగింది" ఈ పథకం ద్వారా చౌడు నేలలను పునరుద్ధరించి భూసారాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. రైతులు తమ భూములకు మట్టి పరీక్షలు చేయించుకొని, అవసరమైన మేరకు జిప్సంను వినియోగించి ప్రభుత్వ సబ్సిడీ సదుపాయాన్ని పొందాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం రైతులు తమ సమీప వ్యవసాయ విస్తరణ అధికారి మండల వ్యవసాయ అధికారి వ్యవసాయ శాఖ కార్యాలయాలు లేదా రైతు వేదికలను సంప్రదించవచ్చని వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి, ఐఏఎస్ పేర్కొన్నారు.

## మోదీ 4399 రోజుల చారిత్రాత్మక పాలనకు గుర్తుగా ప్రత్యేక పూజలు



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 10 (వార్త సంధ్య):** దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వరుసగా 4399 రోజులపాటు దేశానికి నాయకత్వం వహిస్తూ చారిత్రాత్మక మైలురాయిని అధిగమించిన సందర్భంగా కొత్తగూడెం పట్టణంలోని సెంట్రల్ వర్క్‌షాప్ సమీపంలోని శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ప్రపంచ వేదికపై భారతదేశ ప్రతిష్ఠ మరింత పెరగాలని ఆకాంక్షిస్తూ బీజేపీ నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు, సీనియర్ అడ్వకేట్ జీవీకే మనోహర్‌రావు మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతర భారత రాజకీయ చరిత్రలో నరేంద్ర మోదీ పాలన ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచిందన్నారు. 2014 నుంచి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ పేదల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం, డిజిటల్ చెల్లింపుల్లో అగ్రస్థానంలో నిలవడం, చంద్రయాన్-3 విజయవంతం కావడం, జీ-20 సదస్సుకు అధ్యక్షత వహించడం వంటి విజయాలు సాధించిందన్నారు. అలాగే అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణం, ఆర్టికల్-370 రద్దు, మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం, ద్రౌపది ముర్మును రాష్ట్రపతిగా ఎన్నుకోవడం వంటి చారిత్రాత్మక నిర్ణయాలు మోదీ పాలనలో అమలయ్యాయని తెలిపారు. 2047 నాటికి "వికసిత భారత్" లక్ష్య సాధన కోసం మోదీ కృషి చేస్తున్నారని, ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జాటోత్ వెంకన్న నాయక్, సీనియర్ నాయకులు పైడిపాటి రవీందర్, కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి, సముద్రాల గాయత్రి, పద్మ లక్ష్మీదేవి, నవీన్, బలగం శ్రీధర్, మోహనకృష్ణ, గుమ్మలాపురం సత్యనారాయణ, నరేంద్రబాబు, చిన్నీ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బీసీ కమిషన్ సమావేశం ఖైరతాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో ఛైర్మన్ జి. నిరంజన్ అధ్యక్షతన జరిగింది.



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జూన్ 10:** ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, శ్రీమతి బాలలక్ష్మి రంగు మరియు కమిషన్ మెంబర్ సెక్రెటరీ శ్రీమతి బి. బాల మాయ దేవి, ఐ.ఏ.ఎస్., పాల్గొన్నారు. ఈ సమావేశంలో కమిషన్ వివిధ అంశాలపై చర్చించింది. ముఖ్యంగా బీసీ-ఏ గ్రూప్‌లో అనాధలుగా గుర్తించడానికి ప్రస్తుతం ఉన్న 10 సంవత్సరాల వయస్సు నిబంధనను 49 సంవత్సరాలకు పెంచాలని వచ్చిన వినతిపై ఈ నెల 24న విచారణ జరపాలని కమిషన్ నిర్ణయించింది. బీసీ జాబితాలోని 'డి' గ్రూప్‌లో సాతాని (చాత్తాద శ్రీవైష్ణవ) కులం వారు సాతాని పదాన్ని తొలగించాలని కోరిన విషయంలో కూడా విచారణ నిర్వహించాలని కమిషన్ నిర్ణయించింది. అలాగే కామారెడ్డి, మెదక్ మరియు సంగారెడ్డి జిల్లాలలో ఉన్న లొద్ద కులం వారిని బీసీలుగా గుర్తించాలని వచ్చిన వినతులపై సుదీర్ఘంగా చర్చించిన కమిషన్ వారి సామాజిక, విద్య, ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేయాలని కమిషన్ నిర్ణయించింది. రాష్ట్రంలోని విద్యుత్ సంస్థలలో రిజర్వేషన్ల ఉల్లంఘన ఫిర్యాదులపై విచారిస్తున్న కమిషన్ ఆయా సంస్థలను సందర్శించిన విషయం తెలిసిందే. ఈ విషయంలో ఆయా సంస్థల నుండి మరింత సమాచారాన్ని కోరాలని కమిషన్ నిర్ణయించింది. 2022 సంవత్సరంలో ఎంబీసీ కులాలకు చెందిన వారి పిల్లలకు మహాత్మా జ్యోతిబాపులే విద్యాసంస్థల ప్రవేశాలలో 5% రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ఇకముందు కూడా కొనసాగించాలని ప్రభుత్వాన్ని కమిషన్ కోరనుంది. కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చబడని 40 బీసీ కులాలకు చెందిన వారికి కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థలలో ప్రవేశాలు మరియు ఉద్యోగ అవసరాల నిమిత్తం ఇడబ్ల్యూఎస్ సర్టిఫికేట్ల జారీకి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కమిషన్ కోరనుంది. ఈ సమావేశంలో అధికారులు డిప్యూటి డైరెక్టర్ యు. శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి కె. మనోహర్ రావు, ప్రత్యేక అధికారి కుమారి ఎన్. సునీత, సెక్షన్ ఆఫీసర్ జి. సతీష్ కుమార్, రీసెర్చ్ ఆఫీసర్ జి. లక్ష్మీనారాయణ హాజరయ్యారు

## మీనాక్షి నామినేషన్ తిరస్కరణ ప్రజాస్వామ్యానికి విరుద్ధం: డాక్టర్ ఎండీ గౌస్



**చండ్రుగొండ ప్రతినిధి, జూన్ 10(వార్త సంధ్య) :** అశ్వారావుపేట కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అశ్వారావుపేట మున్సిపాలిటీ కో-ఆప్షన్ సభ్యుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఎండీ గౌస్ విమర్శించారు. ప్రతిపక్ష నేతల గొంతు నొక్కేందుకు, ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరిచేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండా, వివరణ ఇచ్చే అవకాశం కల్పించకుండా నామినేషన్‌ను తిరస్కరించడం ఎన్నికల ప్రక్రియ పారదర్శకతపై అనుమానాలకు తావిస్తోందన్నారు. మహిళా సాధికారత గురించి మాట్లాడే బీజేపీ, ఒక మహిళా నాయకురాలు రాజ్యసభకు పోటీ చేయడాన్ని అడ్డుకోవడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ గొంతెత్తాలని, అప్రజాస్వామిక చర్యలకు ప్రజలే తగిన సమయంలో బుద్ధి చెబుతారని డాక్టర్ గౌస్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ వ్యవహారశైలిపై నిరసన వ్యక్తం చేస్తూ ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## ఘనా పారిశ్రామికాభివృద్ధికి 'తెలంగాణ' మార్గనిర్దేశం

### అక్కడ 'ఫార్మా హబ్' ఏర్పాటుకు పూర్తిస్థాయి సహకారం

### రిపబ్లిక్ ఆఫ్ ఘనా ఉన్నత స్థాయి బృందం భేటీలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి





**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జూన్ 10. :** రిపబ్లిక్ ఆఫ్ ఘనా పారిశ్రామికాభివృద్ధికి మార్గనిర్దేశం చేసేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. అక్కడ ఏర్పాటు చేయనున్న 'ఫార్మా హబ్'కు రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆ దేశ ప్రెసిడెన్షియల్ అడ్వైజర్ ఆగస్టస్ ఒబువాడుం టానో నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో బుధవారం మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా 'తెలంగాణ -- ఘనా' మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ఘనా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 24 అవర్ ఎకానమీ అండ్ యాక్సలరేటెడ్ ఎక్స్ పోర్ట్ డెవలప్ మెంట్ ప్రోగ్రాం, ఫార్మా హబ్ ఏర్పాటు తదితర అంశాలను ఆగస్టస్ ఒబువాడుం టానో వివరించారు. ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనకు సహకరించాలని మంత్రి శ్రీధర్ బాబును విజ్ఞప్తి చేశారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఆనతికాలంలోనే పారిశ్రామికరంగంలో తెలంగాణ అద్భుతమైన వృద్ధిని నమోదు చేసిందన్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, ఫుడ్ ప్రాసెసింగ్, డిఫెన్స్, అడ్వాన్స్డ్ మ్యానుఫ్యాక్చరింగ్ తదితర రంగాల్లో అంతర్జాతీయ కేంద్రంగా ఎదిగిందన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించేందుకు అమలు చేస్తున్న 'ఈజ్ ఆఫ్ డూయింగ్ పాలసీ'లను ఆయన వివరించారు. ఫార్మాస్యూటికల్ మ్యానుఫ్యాక్చరింగ్, రీసెర్చ్, వ్యాక్సీన్ల తయారీ, గ్లోబల్ సప్లై చైన్ నిర్వహణ, లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణకున్న అంతర్జాతీయ నైపుణ్యాన్ని పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఘనా ప్రతినిధులకు చెప్పారు. ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనలో తెలంగాణ ఒక నమ్మకైన భాగస్వామిగా ఉంటుందని భరోసానిచ్చారు.

## రవీంద్రభారతిలో ఆకట్టుకున్న బుడగజంగాల కథ ప్రదర్శన




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూన్ 10. :** రవీంద్రభారతి ప్రాంగణంలోని పాల్కురికి సోమన్న మూల వేదికపై తెలంగాణ ప్రజాకళ 99 రోజుల సాంస్కృతిక మహోత్సవంలో భాగంగా 71వ రోజు నిర్వహించిన కార్యక్రమం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. జూన్ 10, 2026 నాడు బాగ్ అంబర్పేట్ నుండి విచ్చేసిన కళ్ళెం అంజయ్య కళ్ళెం లక్ష్మమ్మ బృందం ప్రదర్శించిన ఆరె దొరల (కరిణికోట) కథ ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. వీరికి బాబయ్య, జనార్ధన్ లు సహకరించారు ఈ సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు లిడా. ఏనుగు నరసింహారెడ్డి, ఐఏఎస్ కళాకారులని ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమానికి భాషా సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నర్సింలు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ విజయ్ కుమార్ మరియు సాంస్కృతిక శాఖ సలహాదారులు దినకర్ మరియు పల్లె నర్సింహా పాల్గొన్నారు. ప్రధాన కార్యక్రమానికి ముందు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు శ్రీనివాస్ రాజు, రేలారే ప్రసాద్, విద్యానందాచారి, వీణ, జ్యోత్స్నలు జానపద, సామాజిక చైతన్య గీతాలతో సభను ఉత్సాహపరిచారు కళాకారులు. కార్యక్రమానికి శ్రీనివాస రాజు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

## సంపద కార్పొరేట్‌లకు... భారాలు ప్రజలకు: సీపీఐ రాష్ట్ర నేత వియస్. బోస్ ధ్వజం

### ధరల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ మేడ్చల్ కలెక్టరేట్ ముందు సీపీఐ భారీ ధర్నా

### జిల్లా డీఆర్వో మాలతికి వినతిపత్రం సమర్పణ





**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల దేశ సంపద కొద్దిమంది చేతుల్లోకి వెళ్తుంటే, సామాన్య ప్రజలపై మాత్రం మోయలేని భారాలు పడుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వియస్. బోస్ తీవ్రంగా ధ్వజమెత్తారు. నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల పెరుగుదలను నిరసిస్తూ సీపీఐ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వియస్. బోస్ మాట్లాడుతూ, దేశంలో నిత్యావసరాల ధరలు నిరంతరం పెరుగుతూ సామాన్య ప్రజల జీవనాన్ని దుర్భరంగా మారుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల నియంత్రణలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు.

**అచ్చే దిన్ ఏమైంది? ధరలపై దశాబ్ద కాలంలో భారీ వాత!**

ఎన్నికల సమయంలో "అచ్చే దిన్", "అభివృద్ధి" అంటూ గొప్పలు చెప్పిన ప్రధాని నరేంద్ర మోడీ, నేడు ధరల పెరుగుదలపై నోరు మెదపడం లేదని బోస్ దుయ్యబట్టారు. గత దశాబ్ద కాలంలో సామాన్యుడిపై పడిన భారాన్ని ఆయన గణాంకాలతో వివరించారు: 2014లో ?410 ఉన్న గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర నేడు ?1150 దాటింది (100% పైగా పెరుగుదల). పెట్రోల్ ధర లీటర్‌కు 70 నుండి 117కు చేరగా, డీజిల్ ధరలు కూడా అదే స్థాయిలో పెరిగాయి. వంటనూనె ధర లీటర్‌కు ?90-100 నుండి 170-200కు పెరిగింది. పప్పుధాన్యాలు, కూరగాయలు, పాలు, గుడ్లు, బియ్యం ధరలు రెట్టింపయ్యాయి.

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు తగ్గినప్పుడు కూడా దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలను ఎందుకు తగ్గించడం లేదని ఆయన ప్రశ్నించారు. కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రాయితీలు ఇచ్చే ప్రభుత్వాలు, ప్రజలకు సబ్సిడీలు ఇవ్వడానికి మాత్రం వెనకాడుతున్నాయని మండిపడ్డారు.రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేదు, కానీ మార్కెట్‌లో మాత్రం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఒకవైపు కొద్దిమంది కార్పొరేట్ల సంపద లక్షల కోట్లు పెరుగుతుంటే, సామాన్య కుటుంబాలు నెలాఖరు ఖర్చులు కూడా వెళ్లదీయలేని స్థితిలో ఉన్నాయి." ప్రజాస్వామ్యానికి కార్పొరేట్ పాలన ప్రమాదకరం: ఉమా మహేష్ సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ, ప్రజల కష్టాలను పట్టించుకోకుండా ప్రచార ఆర్భాటాలకు, కార్పొరేట్ ప్రయోజనాలకే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ఇది ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమని హెచ్చరించారు.

**సీపీఐ ప్రధాన డిమాండ్లు:**

నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి. ప్రజా పంపిణీ వ్యవస్థను (రేషన్ సిస్టమ్) మరింత బలోపేతం చేయాలి. విద్య, వైద్యం, విద్యుత్, రవాణా రంగాల్లో ప్రజలపై భారాన్ని తగ్గించాలి. కృత్రిమ కొరత సృష్టించే బ్లాక్ మార్కెట్ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి.

ధర్నా అనంతరం సీపీఐ నాయకత్వ బృందం జిల్లా డీఆర్వో మాలతిని కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ నిరసన కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి కళాకారులు ఆలపించిన విప్లవ గేయాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ ధర్నాలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు, మహిళలు, యువకులు, కార్మికులు మరియు వందలాది మంది కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో కలెక్టరేట్ పరిసరాలను హోరెత్తించారు. ప్రజల సమస్యలపై ప్రభుత్వాలు స్పందించకుంటే ముందు ముందు ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

## ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అధ్యాపకుల కొరతను తీర్చడంతో పాటు వైద్య విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చే దిశగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన నియామక ప్రక్రియలో మరో కీలక ముందడుగు పడింది.



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూన్ 10. :** డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో 30 స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ డిపార్ట్‌మెంట్లలోని 433 పోస్టుల భర్తీ ప్రక్రియను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు పూర్తి చేసింది. ఈ మేరకు ఉద్యోగాలకు ఎంపికైన డాక్టర్ల లిస్టును బుధవారం బోర్డు విడుదల చేసింది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలలోని 34 విభాగాలకు చెందిన మొత్తం 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి బోర్డు గతంలో నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఇందులో అనస్థీషియా, గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్ విభాగాలకు చెందిన 174 పోస్టుల భర్తీ ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. ఆ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇటీవలే నియామక పత్రాలను అందజేశారు. తాజాగా మిగిలిన 30 డిపార్ట్‌మెంట్లలో 433 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు సంబంధించిన తుది ఫలితాలు, సెలక్షన్ లిస్టును ఎంహెచ్‌ఎస్‌ఆర్‌బీ విడుదల చేసింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులతో పాటు, 4 స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టులకు సంబంధించిన సెలక్షన్ జాబితాను కూడా బోర్డు విడుదల చేసింది. ఉద్యోగాలకు ఎంపికైన అసిస్టెంట్ ప్రొఫెసర్లు, స్పీచ్ పాథాలజిస్టులకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుభాకాంక్షలు తెలిపారు. త్వరలోనే వారికి నియామక పత్రాలను అందజేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు, టీచింగ్ హాస్పిటల్స్, ఇతర ఆరోగ్య సంస్థల్లో మానవ వనరులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గత రెండున్నర సంవత్సరాల కాలంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ పరిధిలో సుమారు 15 వేల పోస్టులను భర్తీ చేసినట్లు మంత్రి గుర్తు చేశారు. ఇందులో ఎంబీబీఎస్ వైద్యులు, స్పెషలిస్టు వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, పారామెడికల్ సిబ్బంది తదితర విభాగాలకు చెందిన పోస్టులు ఉన్నాయని తెలిపారు. ఈ నియామకాల ద్వారా ప్రభుత్వ హాస్పిటల్స్‌లో వైద్య సేవల నాణ్యత మరింత మెరుగుపడి ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఉషముళ్ళపూడి గాజులరామరం రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి పీఏసీ ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ





**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** ఉషముళ్ళపూడి కమాన్ నుండి వయా ఎల్లమ్మబండ మీదుగా గాజులరామరం వరకు చేపడుతున్న 100 ఫీట్ల ప్రధాన రహదారి విస్తరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వ అంచనాల కమిటీ , శాసనసభ్యులు ఆరెకపూడి గాంధీ అధికారులను ఆదేశించారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఈ రోడ్డు విస్తరణ పనులను బుధవారం ఆయన మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్, జలమండలి, విద్యుత్ శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ.. ఈ మార్గంలో నిత్యం ఎదురవుతున్న తీవ్ర ట్రాఫిక్ సమస్యల నుంచి ప్రజలకు విముక్తి కలిగించడానికే 100 ఫీట్ల రోడ్డు విస్తరణ చేపట్టామన్నారు. గతంలో తానే స్వయంగా అధికారులతో కలిసి ఉషముళ్ళపూడి కమాన్ నుండి సిక్కుల బస్తీ వరకు పాదయాత్ర చేసి సమస్యలను గుర్తించినట్లు గుర్తుచేశారు. రోడ్డు మధ్యలో ఉన్న బండరాళ్లను, అడ్డంకిగా మారిన విద్యుత్ స్తంభాలను త్వరితగతిన వేరే ప్రాంతానికి తరలించాలి.పనుల వల్ల దెబ్బతిన్న మంచి నీటి పైప్‌లైన్లను వెంటనే పునరుద్ధరించి, ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలి.రోడ్డు విభాగిని పనులను పూర్తి నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలి. అలాగే డివైడర్ల మధ్యలో సుందరీకరణ పనులు చేపట్టాలని సూచించారు.వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఒకరితో ఒకరు సమన్వయం చేసుకుంటూ మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా పనిచేయాలన్నారు. "ఈ 100 ఫీట్ల రోడ్డు అందుబాటులోకి వస్తే ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడమే కాకుండా సమయం, ఇంధనం ఆదా అవుతాయి. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం అని పనుల్లో ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈఈ గోవర్ధన్, ఏఈ సాయి యుగంధర్ రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్, జలమండలి డీజీఎం శ్రీనివాస్ రాజు, ఎలక్ట్రికల్ డీఈ శ్యామ్, స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రజా సంక్షేమ కోసం అహర్నిశలు కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మాజీ డైరెక్టర్, డా. జీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, డా. గడల శ్రీనివాసరావు చెప్పారు



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జూన్ 10 ;** బుధవారం నాడు సో మచ్ కూడా ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జనసేన పార్టీలో చేరా చేరడం జరిగిందని ఆయన తెలిపారు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రజా ఆరోగ్య సేవల నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెడుతున్న సందర్భంగా, తన రాజకీయ ప్రయాణం, ప్రజాసేవపై ఉన్న దృక్పథం, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి తన కార్యాచరణ జనసేన పార్టీ బలోపేతానికి చేపట్టనున్న కార్యక్రమాల గురించి మీడియాతో వివరించారు ఆయన మాట్లాడుతూ ఈ వేదిక ద్వారా డా. గడల శ్రీనివాసరావు ని ఆయన కొత్త రాజకీయ పాత్రలో మీడియా మిత్రులకు పరిచయం చేయడం జరిగింది డా. గడల శ్రీనివాసరావు మాజీ డైరెక్టర్, ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, తెలంగాణ ఛైర్మన్, డా. జీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ జనసేన పార్టీ తన అభివృద్ధిలో కనుగుణంగా జనసేన పార్టీ చేయడం జరిగిందని ఆయన వివరించారు పవన్ కళ్యాణ్ మీద అమితమైన ప్రేమ ఉందని అందుకోసమే సరైన పందాను ఎంచుకొని ఆ పార్టీలో చేయడం జరిగిందని ఆయన వివరించారు సామాజిక కార్యకర్తగా ప్రజల సేవలను పరిష్కరించడంలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని ఆయన తెలిపారు తాను చేసిన సేవలకు ప్రజల సమస్యలు తెలుసుకోవడం జరిగిందని జీవితంలో లక్ష్యం సాధించడానికి ప్రజారాజ్యం పార్టీలో చేరడం జరిగిందని ఆయన వివరించారు ఎవరి మీద విమర్శలు చేయనని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తారని ఆయన తెలిపారు అన్ని రాజకీయ పార్టీలపై విమర్శలు చేయాలని ప్రజా సమస్యలపై పోరాటం చేస్తారని ఆయన తెలిపారు సేవే మార్గమని ఆయన తెలిపారు ఈ సమావేశంలో పలువురు ప్రజారాజ్యం పార్టీ నేతలు పాల్గొన్నారు

## బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై హైదరాబాద్‌లో నేడు రోడ్ షో




**హైదరాబాద్, వార్త సంధ్య:** బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల అభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహం లక్ష్యంగా కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ జూన్ 11న హైదరాబాద్‌లో రోడ్ షో నిర్వహించనుంది. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన రోడ్ షోకు లభించిన విశేష స్పందన నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నారు. ఈ రోడ్ షోకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా, కేంద్ర సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబే గౌరవ అతిథిగా హాజరుకానున్నారు. కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్, అదనపు కార్యదర్శి సనోజ్ కుమార్ ఝాతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు, బొగ్గు, లిగ్నైట్ సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నిపుణులు, పెట్టుబడిదారులు పాల్గొంటారు. బొగ్గు గ్యాసిఫికేషన్ ద్వారా బొగ్గును సింథసిస్ గ్యాస్‌గా మార్చి మిథనాల్, అమ్మోనియం నైట్రేట్, సింథటిక్ సహజ వాయువు, పారిశ్రామిక రసాయనాల తయారీలో వినియోగించవచ్చు. దేశ ఇంధన భద్రతను బలోపేతం చేయడం, దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం, దేశీయ బొగ్గు వనరులను సమర్థంగా వినియోగించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ రంగానికి ప్రాధాన్యం ఇస్తోంది. విధానపరమైన మద్దతు, సాంకేతిక ఆవిష్కరణలు, పెట్టుబడి అవకాశాలు, ప్రాజెక్టుల అమలు వ్యూహాలపై చర్చలు జరిగే ఈ రోడ్ షో దేశంలో గ్యాసిఫికేషన్ రంగ అభివృద్ధికి, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాల సాధనకు దోహదపడనుంది

## తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై కాంగ్రెస్, బీజేపీ డ్రామాలు ఆపాలి: బోయినపల్లి వినోద్ కుమార్



**జూబ్లీహిల్స్, వార్త సంధ్య:** తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్, బీజేపీ ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయ డ్రామాలు ఆపాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తుమ్మిడిహెట్టి ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును మొదట ప్రతిపాదించింది మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభుత్వమేనని గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చవాన్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. కిరణ్ కుమార్ రెడ్డికి లేఖ రాశారని తెలిపారు. ఆ సమయంలో కేంద్రంలో, మహారాష్ట్రలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాలే అధికారంలో ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను పలుమార్లు కలిసి ప్రాజెక్టుకు అనుమతి కోరినా ఆయన అంగీకరించలేదని వినోద్ కుమార్ చెప్పారు. తామే ముంబైలో ఐదు రోజుల పాటు ఉండి ప్రాజెక్టు కోసం ప్రయత్నించామని, అయితే ఫడ్నవీస్ తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు వ్యతిరేకంగా నిలిచారని వివరించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తనపై చేస్తున్న ఆరోపణలను ఖండించిన ఆయన, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు తాను అడ్డుపడితే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రితో ఘర్షణాత్మక ధోరణిలో వ్యవహరిస్తూ అనుమతులు ఎలా సాధిస్తారని ప్రశ్నించారు. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టే తెలంగాణకు ప్రధాన ప్రత్యామ్నాయమని, మేడిగడ్డపై విమర్శలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు అదే ప్రాజెక్టుకు మరమ్మతులు చేపడుతున్నారని వ్యాఖ్యానించారు. ఈ అంశంలో కాంగ్రెస్, బీజేపీ పరస్పర ఆరోపణలు మానుకుని రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, మాజీ జడ్పీ ఛైర్మన్ దఫేదార్ రాజు, మాజీ కార్పొరేషన్ ఛైర్మన్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ పాలనలో నిత్యం ఆడబిడ్డలపై అఘాయిత్యాలే

## ఖమ్మం బాలిక పై దురాగతం, మల్కాజ్ గిరి లో మహిళ కాల్చివేత ఘటనలు తీవ్రంగా కలిచివేశాయి

## సీఎం రేవంత్ రెడ్డి పాలనపై పట్టు కోల్పోయారు

## మహిళలపై అఘాయిత్యాలకు ప్రభుత్వానిదే బాధ్యత

## తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్, వార్త సంధ్య :** రేవంత్ రెడ్డి పాలనలో మహిళలపై నిత్యం అత్యాచారాలు, దాడులు జరుగుతున్నాయని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం రాష్ట్రంలో ఏదో ఒక చోట మహిళపై జరుగుతున్న దాడులు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఖమ్మం నగరంలో 12 ఏళ్ల బాలికపై అఘాయిత్యానికి ఒడిగట్టి ఆ బాలికను నాలుగో అంతస్తు నుంచి తోసేసి హత్య చేయాలని ప్రయత్నించిన ఘటన దారుణమని కవిత అన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోనే ఇలాంటి దారుణాలు జరుగుతుంటే మారుమూల ప్రాంతాల్లో మహిళలు, బాలికల భద్రత సంగతేంటనీ ప్రశ్నించారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో మైనర్ బాలికపై జరిగిన అఘాయిత్యం ఘటనలో నిందితుడికి కఠిన శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. అటు మల్కాజ్ గిరిలో ఓ వ్యక్తి తన భార్యను తుపాకీ తో కాల్చి చంపిన ఘటన దారుణమన్నారు. మూడు నెలల క్రితమే నిందితుడు తన భార్యను కాల్చిచంపుతానంటూ బహిరంగంగా బెదిరించాడని కవిత గుర్తు చేశారు. అప్పుడే పోలీసులు స్పందించి చర్యలు తీసుకునే ఉంటే ఓ మహిళ నిండు ప్రాణం బలయ్యేదని కాదన్నారు.

### సీఎం పాలనపై పట్టుకోల్పోయారు

మహిళల నేరాలను అరికట్టటంలో రేవంత్ రెడ్డి ఘోరంగా విఫలమయ్యారని కవిత అన్నారు. ఈ ప్రభుత్వం నిర్లక్ష్యంగా కారణంగా మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు గాడి తప్పాయని...ఖమ్మం, మల్కాజ్ గిరి ఘటనలే అందుకు సాక్ష్యమని కవిత అన్నారు. పాలన పై సీఎం రేవంత్ రెడ్డి పట్టు కోల్పోయారని కవిత విమర్శించారు. ఇకనైనా మేల్కొని మహిళల రక్షణ పై యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కవిత డిమాండ్ చేశారు. ఖమ్మం, మల్కాజ్ గిరి ఘటనల్లో నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

### చివరి శ్వాస వరకు ప్రజా సమస్యలపై పోరాడారు

తెలంగాణ ఉద్యమకారుడు, సోషలిస్ట్ నాయకుడు మురలీధర్ దేశ్ పాండే మరణం తనను తీవ్రంగా కలిచి వేసిందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. వారి మృతి తెలంగాణ సమాజానికి, ముఖ్యంగా కళాకారుల లోకానికి తీరని లోటన్నారు. కొత్త పేట్ లోని మురలీధర్ దేశ్ పాండే గారి నివాసం లో ఆయన పార్థీవ దేహానికి బుధవారం కవిత నివాళులు అర్పించారు. తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జానపద, సాంస్కృతిక కళాకారులను ఏకం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని చెప్పారు. కళాకారుల హక్కుల కోసం, వారి గుర్తింపు, సంక్షేమం కోసం చివరి శ్వాస వరకు కొట్లాడరన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం గళమెత్తిన సోషలిస్టు నాయకుడు మురలీధర్ దేశ్‌పాండే గారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని చెప్పారు. వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు, తోటి ఉద్యమకారులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ బీజేపీ-ఎన్నికల కమిషన్ డ్రామా: సామా రామ్మోహన్ రెడ్డి

## వోఆర్ కు నామినేషన్ తిరస్కరించే అధికారం లేదని వ్యాఖ్య

## సీఎం రేవంత్ రెడ్డిపై బురద జల్లేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపణ

## నామినేషన్ తిరస్కరణపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని వెల్లడి

## బీఎల్ సంతోష్ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా రాజకీయ కుట్రలు చేస్తున్నారని విమర్శ

## ఓటు చోరీ ఆరోపణలపై ఎన్నికల కమిషన్ సమాధానం చెప్పాలని డిమాండ్



**హైదరాబాద్, గాంధీ భవన్,వార్త సంధ్య :** గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి ఎన్నికల సంఘం, బీజేపీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ వ్యవహారం ఎన్నికల కమిషన్‌తో కలిసి బీజేపీ ఆడుతున్న రాజకీయ డ్రామా మాత్రమేనని ఆరోపించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఫిర్యాదులపై విచారణ చేసే అధికారం రిటర్నింగ్ ఆఫీసర్ (=ా)కు లేదని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ ఎవరో ఒత్తిడి చేయడంతోనే మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించారని ఆరోపించారు. తెలంగాణలో ఆమెపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని, అయినా నామినేషన్‌ను తిరస్కరించేందుకు ఏదో ఒక కారణాన్ని సాకుగా చూపారని అన్నారు. ఫిర్యాదు చేయడం, క్రిమినల్ కేసు నమోదవడం రెండూ వేర్వేరు అంశాలని స్పష్టం చేసిన ఆయన, ఈ వ్యవహారంలో జరిగిన చర్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. నామినేషన్ తిరస్కరణ అంశంపై కాంగ్రెస్ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తుందని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దక్షిణ భారతదేశంలో చేపడుతున్న అభివృద్ధి, పరిపాలనా కార్యక్రమాలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నాయని పేర్కొన్నారు. ఆ ప్రభావాన్ని తట్టుకోలేక ఆయన నైతికతను దెబ్బతీయడానికి రాజకీయ కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌పై కూడా సామా రామ్మోహన్ రెడ్డి విమర్శలు చేశారు. తెలంగాణలో ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో ఆయన పాత్ర ఉందని ఆరోపిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరచడమే బీజేపీ లక్ష్యమని అన్నారు. అలాగే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎన్నికలలో ఓటు చోరీ జరిగిందని ఆధారాలు సమర్పించినప్పటికీ, ఎన్నికల కమిషన్ నుంచి సరైన సమాధానం రాలేదని విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడవద్దని ఎన్నికల సంఘాన్ని హెచ్చరించారు.

# ఇరాన్‌లో చిక్కుకున్న ఉత్తరాంధ్ర యువకులు

### ఆహారం, నీరు లేక నౌకలోనే నరకయాతన
### పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్‌లో చిక్కుకుపోయిన యువకులు
### బందర్ అబ్బాస్ పోర్టు సమీపంలో నిలిచిపోయిన నౌక
### అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్న కుటుంబ సభ్యులు



పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్‌లోని తీర ప్రాంతంలో ఉత్తరాంధ్రకు చెందిన పలువురు యువకులు చిక్కుకుపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెలల తరబడి నౌకలోనే ఉండిపోవాల్సి వస్తోందని, సరైన ఆహారం, తాగునీరు కూడా అందక నరకయాతన అనుభవిస్తున్నామని వారు వీడియో ద్వారా తమ కుటుంబ సభ్యులకు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన వారి బంధువులను ఆందోళనకు గురిచేస్తోంది.విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం చింతపల్లి పంచాయతీకి చెందిన కొమర సోమరాజు ప్రస్తుతం 'ఎంవీ పాస్కల్' అనే నౌకలో ట్రైనీ వైపర్‌గా పనిచేస్తున్నారు. పశ్చిమాసియా ప్రాంతంలో నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా ఇరాన్‌లోని బందర్ అబ్బాస్ పోర్టు సమీప యాంకరేజ్ ప్రాంతంలో ఈ నౌక నిలిచిపోయింది. దీంతో సిబ్బంది బయటకు రావడానికి, స్వదేశాలకు చేరుకోవడానికి ఎటువంటి అవకాశాలు లేకుండా పోయాయి.ఎంవీ పాస్కల్ నౌకలో మొత్తం 13 మంది సిబ్బంది ఉన్నారు. వారిలో నలుగురు విదేశీయులు కాగా, మిగిలిన వారు భారతీయులు. ఉత్తరాంధ్రకు చెందిన కొమర సోమరాజుతో పాటు శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మానికి చెందిన జెర్రి విష్ణు, ఆమదాలవలసకు చెందిన దుర్గాప్రసాద్, పరిపతివానిపేటకు చెందిన పరపతి రమణ కూడా అక్కడే చిక్కుకుపోయారు. తమ పరిస్థితి రోజురోజుకూ దారుణంగా మారుతోందని వారు వీడియో ద్వారా తమ ఆవేదనను వ్యక్తం చేశారు.కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, వీరంతా ముంబయిలోని ఓ ఏజెంట్ ద్వారా ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లారు. ఒక్కొక్కరి నుంచి సుమారు రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్లు ఆరోపిస్తున్నారు. అయితే ఆరు నెలల ఒప్పందం పూర్తయినప్పటికీ యాజమాన్యం వారిని స్వదేశాలకు పంపే చర్యలు చేపట్టలేదని బాధిత కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. నౌక యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా దాదాపు నాలుగు నుంచి అయిదు నెలలుగా సరైన ఆహారం, తాగునీరు కూడా అందడం లేదని బాధితులు చెబుతున్నారు. మరోవైపు, కొమర సోమరాజుకు గత 12 నెలలుగా జీతం కూడా చెల్లించలేదని ఆయన తల్లిదండ్రులు వాపోతున్నారు. తమ పిల్లల ప్రాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితి నెలకొన్నందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి వారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.బాధిత యువకులు పంపిన వీడియోలు ప్రస్తుతం కుటుంబ సభ్యుల మధ్య తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. యుద్ధ ప్రభావిత ప్రాంతంలో చిక్కుకున్న తమ వారిని కాపాడాలని, స్వదేశానికి తీసుకురావాలని, విదేశాంగ శాఖ తక్షణమే జోక్యం చేసుకోవాలని కుటుంబాలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాయి. పరిస్థితిపై అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కూడా కోరుతున్నారు.


# పెద్దపల్లిలో తప్పిన పెను ప్రమాదం

### త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డ రైల్వే కార్మికులు
### పెద్దపల్లి సమీపంలో పట్టాలు తప్పిన రైల్వే ట్రాక్ యంత్రం



తెలంగాణలోని పెద్దపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు చేపడుతుండగా, ఓ ట్రాక్ మెయింటెనెన్స్ మెషిన్ అకస్మాత్తుగా పట్టాలు తప్పింది. అక్కడే ఉన్న సిబ్బంది అప్రమత్తమై పక్కకు పరుగులు తీయడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది.ఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి స్టేషన్ సమీపంలో రైల్వే సిబ్బంది పట్టాల తనిఖీ, మరమ్మతు పనుల్లో నిమగ్నమై ఉన్నారు. నలుగురైదుగురు సిబ్బంది ప్రయాణించేలా ఉండే ఈ ట్రాక్ తనిఖీ యంత్రం హఠాత్తుగా అదుపుతప్పి కార్మికుల వైపు దూసుకువచ్చింది. ప్రమాదాన్ని పసిగట్టిన సిబ్బంది తక్షణమే పక్కకు తప్పుకోవడంతో ముప్పు తప్పింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.అయితే, ఈ ప్రమాదం కారణంగా రైల్వే ట్రాక్ గణనీయంగా దెబ్బతింది. సమాచారం అందుకున్న వెంటనే ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. యంత్రం పట్టాలు తప్పడానికి గల కారణాలను విశ్లేషించేందుకు ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించారు. ప్రస్తుతం దెబ్బతిన్న ట్రాక్‌కు యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు నిర్వహిస్తున్నామని, దీనివల్ల రైళ్ల రాకపోకలకు స్వల్ప అంతరాయం కలిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

# బీజేపీ అహంకార రాజకీయాలకు ప్రజలే గుణపాఠం చెప్పాలి: గడ్డం వంశీకృష్ణ



**హైదరాబాద్, జూన్ 10 (వార్త సంధ్య):** ప్రజలు తమ హక్కుల కోసం పోరాడకపోతే ప్రమాదకర పరిస్థితులు ఎదురవుతాయని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ హెచ్చరించారు. బీజేపీ ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తోందని, న్యాయం కోసం ప్రజలంతా ఉద్యమ స్ఫూర్తితో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలు మాట్లాడకపోతే, తమ హక్కుల కోసం నిలబడకపోతే ప్రస్తుతం ఎన్నికల సీట్లతో మొదలైన సమస్యలు రేపు ప్రతి ఇంటి గడప వరకు చేరే ప్రమాదం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల అప్రమత్తతే అత్యంత కీలకమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ ధరల పెంపు వంటి అంశాల్లో ప్రజాభిప్రాయాన్ని పూర్తిగా విస్మరిస్తోందని ఆరోపించారు. "ఎవరు ఏమి చేసుకుంటారో చేసుకోండి" అన్న ధోరణిలో బీజేపీ వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజల సమస్యల పట్ల బాధ్యతారాహిత్య వైఖరి అవలంబిస్తోందని అన్నారు. బంగారం కొనుగోళ్ల విషయంలో కూడా కేంద్ర నాయకత్వం ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టించిందని గడ్డం వంశీకృష్ణ ఆరోపించారు. యువతను, సామాన్య ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ గందరగోళ పరిస్థితుల్లోకి నెట్టేస్తున్నారని విమర్శించారు. బీజేపీ నాయకత్వం "మమ్మల్ని ఎవ్వరూ ఏమీ చేయలేరు" అన్న అహంకార ధోరణితో వ్యవహరిస్తోందని పేర్కొన్న ఆయన, ప్రజలు సరైన నాయకులను ఎన్నుకుంటే ఇటువంటి పరిస్థితులు తలెత్తవని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో శక్తివంతమైన ఆయుధమని గుర్తుచేశారు. దేశంలో రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఎంపీ పేర్కొన్నారు. న్యాయం కోసం ప్రజలంతా ఒక విప్లవాత్మక ఉద్యమంలా ఏకమై పోరాడాలని పిలుపునిచ్చారు. బీజేపీ పాలన, విధానాలపై ప్రజలు లోతుగా ఆలోచించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం సీట్లు ఇస్తాం

### చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, శ్రీకాంతాచారిల రుణం తీర్చుకోవడానికే బీసీ ఉద్యమం
### జాతీయ స్థాయిలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధనకు ఉద్యమిస్తా
### తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత




**హైదరాబాద్, వార్త సంధ్య :** చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, శ్రీకాంతాచారిల రుణం తీర్చుకోవడానికే బీసీ రిజర్వేషన్ల సాధన ఉద్యమం ప్రారంభించానని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. బుధవారం బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ కార్యాలయంలో బీసీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కవిత మాట్లాడుతూ, తాము చేసిన ఉద్యమాలకు దిగివచ్చే రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీ, కౌన్సిల్ లో తీర్మానం చేసి పంపిందన్నారు. బిల్లు కేంద్రానికి పంపి చేతులు దులుపుకున్న ముఖ్యమంత్రి దాని ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే ప్రయత్నాలేవి చేయడం లేదన్నారు. దేశవ్యాప్తంగా బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఉద్యమిస్తానని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన తరపున 50 శాతం టికెట్లు బీసీ నాయకులకు ఇస్తానని హామీ ఇచ్చారు.

# మల్కాజ్‌గిరిలో కాల్పుల కలకలం

### అనుమానంతో భార్యను తుపాకీతో కాల్చి చంపిన భర్త
### భార్యను తుపాకీతో కాల్చి చంపిన రియల్టర్ కుమార్
### తుపాకీ శబ్దం విని పోలీసులకు సమాచారం ఇచ్చిన స్థానికులు
### మొదటి భార్యకు విడాకులు ఇచ్చి ఆమె సోదరితో ప్రేమ పెళ్లి

హైదరాబాద్ మల్కాజ్‌గిరి పరిధి మారుతినగర్‌లో దారుణం జరిగింది. స్థిరాస్తి వ్యాపారి కుమార్ తన రెండో భార్య నిషారాణిపై అనుమానంతో తుపాకీతో కాల్చి చంపాడు. కాల్పుల శబ్దాలు విని భయాందోళనకు గురైన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీలులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.అయితే నిందితుడు 3 నెలల క్రితం వాహన తనిఖీల్లో తుపాకీతో పట్టుబడడంతో అంబర్‌పేట పోలీసులు దానిని సీజ్ చేశారు. అయినా కూడా కుమార్ మరో తుపాకీ కొనుగోలు చేసి నిషారాణిపై ఈరోజు తెల్లవారుజామున 2 రౌండ్ల కాల్పులు జరిపి కిరాతకంగా హత్య చేశాడు. గతంలో కుమార్‌ను మొదటి భార్య వదిలి వెళ్లిపోవడంతో ఆమె చెల్లెలు నిషారాణిని ప్రేమ పెళ్లి చేసుకున్నాడని బంధువులు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# వాహనాల తనిఖీ, పోలీసులపై గంజాయి ముఠా రాళ్లదాడి

### అప్రమత్తమై కాల్పులు జరిపిన ఎస్సై
### గంజాయితో పరారవుతున్న నలుగురుని అదుపులోకి తీసుకున్న పోలీసులు
### పట్టుబడిన వారిలో ఆంధ్రా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ వాసులు
### మొత్తం 209 కేజీల గంజాయిని సీజ్ చేసిన అధికారులు



అల్లూరి జిల్లా అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి స్మగ్లర్ల పై పోలీసుల కాల్పులు కలకలం సృష్టించింది. ఒడిశా నుంచి చింతపల్లి మండలం లోతు గడ్డ మీదుగా వెళుతున్న గంజాయి ముఠా వాహనాలను పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో గంజాయ్ స్మగ్లర్లు రాళ్లతో పోలీసులపై దాడులకు ప్రయత్నం చేశారు. దాంతో హెడ్ కానిస్టేబుల్ తప్పించుకున్నారు. నిందితులు హెడ్ కానిస్టేబుల్ కాలర్ పట్టుకుని దాడికి యత్నిస్తుండగా ఎస్సై సాయిరాం గాల్లో రెండు రౌండ్లు కాల్పులు జరిపారు.దాంతో స్మగ్లర్లు వాహనాలు వదిలి పారిపోతుండగా పోలీసులు వెంటపడి అదుపులో తీసుకున్నారు. మొత్తం 209 కిలోల గంజాయితోపాటు ఓ కారు, రెండు బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రకు చెందిన ముఠా ఉంది. ఒడిశా నుంచి ఆంధ్ర మీదుగా గంజాయ్ తరలిస్తుండగా పట్టుకున్నామని ఎస్ఐ సాయిరాం ఈ సందర్భంగా వెల్లడించారు. చింతపల్లి మండలం అన్నవరం స్టేషన్ పరిధిలో లోతుగడ్డ సమీపంలో ముందస్తు సమాచారంతో పోలీసు అధికారులు తనిఖీలను నిర్వహిస్తున్నారు.బుధవారం తెల్లవారుజామున పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో గంజాయితో వస్తున్న కారును తనిఖీ చేస్తున్న క్రమంలో గంజాయి ముఠా పోలీసులపై రాళ్లతో దాడి చేసింది. ఈ దాడిలో హెడ్ కానిస్టేబుల్ కాలర్ కాలర్ పట్టుకున్నారు. అప్రమత్తమైన ఎస్సై గాలిలోకి కాల్పులు జరపడంతో స్మగ్లర్లు వెనక్కి తగ్గారు. వారు పరారవుతుండగా నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# జీతాల కంటే వేగంగా పెరుగుతున్న ఖర్చులు

**పార్ట్ టైం చేయకపోతే పూటగడవట్లేదని భోరుమంటున్న ఉద్యోగులు**

**దేశంలో క్రమంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం ఇప్పుడు సాధారణ ప్రజల దైనందిన జీవితాన్నే కాకుండా**

వారి వృత్తి, ఉద్యోగ నిర్ణయాలను కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, రవాణా ఖర్చులతో సహా రోజువారీ జీవన వ్యయం విపరీతంగా పెరిగిపోవడంతో, తమ ప్రస్తుత జీతాలు మునుపటిలా ఆర్థిక భరోసా ఇవ్వడం లేదని అత్యధిక శాతం మంది ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నిరుత్సాహకర పరిస్థితుల వల్ల అదనపు ఆదాయ మార్గాలను వెతుక్కోవడం, ఎక్కువ ప్యాకేజీలు ఇచ్చే కంపెనీలకు మారడం, అలాగే ఖరీదైన మహానగరాలను వదిలి చిన్న నగరాలకు తరలివెళ్లడం వంటి కీలక మార్పులకు ఉద్యోగులు సిద్ధమవుతున్నారు. ప్రముఖ ఉద్యోగ నియామక వేదిక 'ఇండీడ్' నిర్వహించిన తాజా సర్వేలో ఈ సంచలన విషయాలు వెల్లడయ్యాయి. దేశవ్యాప్తంగా 1,200 మందికి పైగా ఉద్యోగులు, 1,000 కి పైగా కంపెనీల యాజమాన్యాల నుండి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. ఈ సర్వే నివేదిక ప్రకారం.. ప్రస్తుత కార్పొరేట్ రంగంలో అత్యధిక శాతం మంది ఉద్యోగులు తక్కువ జీతాలతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దాదాపు 68 శాతం మంది ఉద్యోగులు తమ ప్రస్తుత ఆదాయంతో నెలవారీ జీవన వ్యయాలను సౌకర్యవంతంగా తీర్చలేకపోతున్నామని స్పష్టం చేశారు. దీనిని బట్టి జీతాల పెరుగుదల వేగానికి, మార్కెట్లో వస్తువుల ధరల పెరుగుదల వేగానికి మధ్య ఉన్న అంతరం అంతకంతకూ విస్తరిస్తోందని స్పష్టమవుతోంది. కేవలం 13 శాతం మంది ఉద్యోగులు మాత్రమే తమ ఆదాయం ప్రస్తుత సౌకర్యవంతమైన జీవితానికి సరిపోతుందని చెప్పగా, మిగిలిన వారిలో 32 శాతం మంది ఏదో ఒక రకంగా నెట్టుకొస్తున్నారు. మరో 24 శాతం మంది తమ ఆర్థిక పరిస్థితిని నిర్వహించడం కష్టంగా మారుతోందని అంగీకరించగా, 12 శాతం మంది ఉద్యోగులు తాము తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 72 లక్షల ప్యాకేజీకి 'నో' చెప్పిన టెక్కీ.. వైరల్ అవుతున్న అసలు కారణాలు ఇవే! ఈ ఆర్థిక ఇబ్బందులు ప్రజల మానసిక ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.



సర్వేలో పాల్గొన్న వారిలో 41 శాతం మంది ఉద్యోగులు రెండు సంవత్సరాల క్రితం కంటే ఇప్పుడు తాము ఎక్కువ ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు అంగీకరించారు. ఆహారం, గృహ వసతి, వైద్యం మరియు విద్య వంటి ప్రాథమిక అవసరాల ఖర్చులు మధ్యతరగతి కుటుంబాల పొదుపును పూర్తిగా హరించివేస్తున్నాయని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ఈ కారణంగా కేవలం ఒకే ఉద్యోగంపై వచ్చే జీతంపై ఆధారపడి తమ భవిష్యత్తు ఆర్థిక లక్ష్యాలను చేరుకోవడం అసాధ్యంగా మారుతుండటంతో, 'అదనపు ఆదాయం' అనేది ఒక లగ్జరీగా కాకుండా నేటి కాలపు ముఖ్య అవసరంగా మారింది. సర్వే ప్రకారం ఇప్పటికే 14 శాతం మంది ఫ్రీలాన్సింగ్ లేదా ఇతర సైడ్ బిజినెస్‌ల ద్వారా క్రమం తప్పకుండా అదనపు ఆదాయాన్ని సంపాదిస్తుండగా, మరో 19 శాతం మంది అప్పుడప్పుడు పార్ట్ టైమ్ పనులు చేస్తున్నారు. దీనికి తోడు 24 శాతం మంది ఉద్యోగులు భవిష్యత్తులో అదనపు ఆదాయ మార్గాన్ని ప్రారంభించాలని యోచిస్తున్నారు. అంటే, మొత్తంగా 60 శాతం మంది ఉద్యోగులు కేవలం వార్షిక జీతాల పెంపు (అప్రైజల్స్) కోసం ఎదురుచూడకుండా సొంతంగా ప్రత్యామ్నాయ మార్గాలను సృష్టించుకుంటున్నారు. ఈ జీవన వ్యయాల భారం మెట్రో నగరాల పట్ల ఉద్యోగుల్లో ఉన్న మోజును క్రమంగా తగ్గిస్తోంది. సర్వేలో 39 శాతం మంది గృహసముదాయాల అద్దెలను తమ అతిపెద్ద సవాలుగా పేర్కొనగా, 27 శాతం మంది ట్రాఫిక్ సమస్యలు మరియు సుదీర్ఘ ప్రయాణాల వల్ల విసిగిపోతున్నట్లు చెప్పారు. ఈ ఇబ్బందుల కారణంగా మెట్రో నగరాల్లో నివసిస్తున్న 54 శాతం మంది ఉద్యోగులు, తమకు గనుక సమానమైన కెరీర్ అవకాశాలు లభిస్తే టైర్-2, టైర్-3 నగరాలకు (చిన్న నగరాలు) మారిపోవడానికి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఈ సరికొత్త ధోరణి ముఖ్యంగా హైదరాబాద్‌లోని ఉద్యోగులలో అత్యంత స్పష్టంగా కనిపించగా, ముంబై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు నగరాల వారు సైతం ఈ మార్పునకు మొగ్గు చూపుతున్నారు. ఉద్యోగుల ఆలోచనలకు తగ్గట్టుగానే 43 శాతం మంది యజమానులు కూడా తమ నియామక వ్యూహాలను మార్చుకుంటూ, ప్రతిభను ఆకర్షించడానికి టైర్-2, టైర్-3 నగరాలు ఇప్పుడు తమకు అత్యంత ముఖ్యమైనవిగా మారుతున్నాయని అంగీకరించారు. ఈ మారుతున్న కాలంలో ఉద్యోగాన్ని ఎంచుకునేటప్పుడు కేవలం అధిక జీతాలే కాకుండా, ఉద్యోగ భద్రతకు అభ్యర్థులు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు. సర్వేలో 41 శాతం మంది ఉద్యోగ స్థిరత్వం మరియు భద్రతను ముఖ్యమైన అంశంగా పేర్కొనగా, 30 శాతం మంది మాత్రమే అధిక జీతాలు మరియు మెరుగైన ప్యాకేజీలను కోరుకున్నారు. తక్కువ ఖర్చుతో కూడిన నగరాలు మరియు మెరుగైన 'వర్క్-లైఫ్ బ్యాలెన్స్' (పని-జీవిత సమతుల్యత) కూడా నేటి తరం ఉద్యోగులకు ప్రాధాన్యత అంశాలుగా మారాయి. అయితే ఈ సర్వే ఒక విచిత్రమైన కార్పొరేట్ వైరుధ్యాన్ని కూడా బయటపెట్టింది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం వల్ల తమ సిబ్బంది తీవ్రంగా నష్టపోతున్నారని 73 శాతం కంపెనీలు అంగీకరించాయి. అలాగే ఉద్యోగుల జీతాల అంచనాలు పెరుగుతున్నాయని 56 శాతం యజమానులు స్పష్టం చేశారు. అయినప్పటికీ, తమ ఉద్యోగులపై పడుతున్న ఈ ఆర్థిక భారాన్ని తగ్గించడానికి లేదా సహాయపడటానికి దాదాపు 77 శాతం కంపెనీలు ఎలాంటి కొత్త రాయితీలను, అలవెన్సులను లేదా ప్రత్యేక ఆర్థిక ప్రయోజనాలను ప్రకటించకపోవడం గమనార్హం. దేశంలో మారుతున్న ఈ ఉద్యోగ వాతావరణం భవిష్యత్తులో కంపెనీల నియామకాలను, నగరాల విస్తరణను పూర్తిగా మార్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఇరాన్ యుద్ధంపై ట్రంప్ కీలక ప్రకటన

గంటల వ్యవధిలోనే భారీ వైమానిక, క్షిపణిలతో టెహ్రాన్ మీద యుఎస్ మిలిటరీ దాడులు పశ్చిమ ఆసియాలో శాంతి ఆశలు కల్పిస్తూ కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ఒక్కసారిగా ముక్కలైంది. వ్యూహాత్మక హోర్ముజ్ జలసంధిలో అమెరికాకు చెందిన అధునాతన 'అపాచీ' దాడి హెలికాప్టర్‌ను టెహ్రాన్ (ఇరాన్) కూల్చివేసిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ధృవీకరించిన కొద్ది గంటల్లోనే.. అమెరికా సైన్యం ఇరాన్‌పై భారీ వైమానిక, క్షిపణి దాడులను ప్రారంభించింది. ఈ ఆకస్మిక దాడి ప్రాంతీయంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీయడమే కాకుండా, పశ్చిమ ఆసియాలో శాంతి ప్రయత్నాలకు గట్టి ప్రతిఘటన ఇచ్చింది. ఈ ప్రతికార చర్యలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏబీసీ న్యూస్‌తో మాట్లాడుతూ.. ఇరాన్ చర్యకు మా ప్రతిస్పందన చాలా బలంగా, అత్యంత శక్తివంతంగా ఉండాలని నేను గట్టిగా నమ్మాను, ఈ దాడులు కూడా సరిగ్గా అలాంటివేనని వ్యాఖ్యానించారు. అమెరికా అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇరాన్‌కు చెందిన ఒక వన్-వే అటాక్ (ఆత్మాహుతి) డ్రోన్ దాడి వల్లే అమెరికా అపాచీ హెలికాప్టర్ కూలిపోయింది. అయితే, హెలికాప్టర్ ప్రమాదంలో చిక్కుకున్న ఇద్దరు అమెరికా పైలట్లను అమెరికా నావికాదళానికి చెందిన ఒక ఉపరితల డ్రోన్ సముద్రం నుండి సురక్షితంగా రక్షించిందని, వారి పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని సైనిక వర్గాలు తెలిపాయి. వాల్ స్ట్రీట్ జర్నల్‌తో మాట్లాడిన ట్రంప్.. పైలట్లు క్షేమంగా ఉన్నందున హెలికాప్టర్ ఘటన 'పెద్ద విషయం కాదని' ఒకవైపు చెబుతూనే, మరోవైపు ఇరాన్ రక్షణ వ్యవస్థలపై విరుచుకుపడటం గమనార్హం. ఈ దాడుల తీవ్రతను ఇరాన్ ప్రభుత్వ మీడియా సైతం ధృవీకరించింది. హోర్ముజ్ జలసంధిలోని అత్యంత కీలకమైన ఖేష్మ్ ద్వీపంతో పాటు, సిరిక్ ఓడరేవు నగరంపై అమెరికా క్షిపణులతో విరుచుకుపడిందని ఇరాన్ పేర్కొంది. మిలిటరీకి ఎదురుదెబ్బ.. హోర్ముజ్ జలసంధి సమీపంలో కుప్పకూలిన అపాచీ హెలికాప్టర్.. అసలేం జరిగింది.. అలాగే సమీపంలోని బందర్ అబ్బాస్, జలసంధి ప్రవేశ ద్వారమైన జాస్క్ కౌంటీ పరిసరాల్లో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయని




స్థానిక నివాసితులు తెలిపారు. హోర్ముజ్ జలసంధి చుట్టూ అమర్చిన అనేక ఇరాన్ వాయు రక్షణ వ్యవస్థలు రాడార్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయి. అమెరికా సైనిక కేంద్ర కమాండ్ ఈ మిషన్‌ను "ఇరాన్ యొక్క అన్యాయమైన దురాక్రమణకు అనుపాత ప్రతిస్పందన" గా అభివర్ణించింది. అమెరికా దాడుల అనంతరం ఇరాన్ తీవ్రంగా స్పందించింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి ఎక్స్ వేదికగా స్పందిస్తూ, తమ దేశంపై జరిగిన ఏ దాడిని లేదా బెదిరింపును అయినా జవాబు లేకుండా వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ఆ ప్రాంతంలోని విదేశీ బలగాలు (అమెరికా సైన్యం) ప్రమాదాలు లేదా ఎదురుకాల్పుల్లో చిక్కుకునే అవకాశం ఉందని, అలాంటి ముప్పులను తగ్గించుకోవాలంటే వాళ్ళు వెంటనే ఇక్కడి నుండి వెళ్లిపోవడమే ఉత్తమ పరిష్కారమని ఆయన స్పష్టం చేశారు. అయితే, గత 24 గంటల్లో ఎలాంటి దాడులు జరగలేదని ఇరాన్ సైనిక మూలాలు కొన్ని నివేదించినప్పటికీ, శత్రువు మళ్లీ తమను రెచ్చగొడితే నిర్ణయాత్మక ప్రతిస్పందన ఉంటుందని హెచ్చరించాయి. మరోవైపు, పశ్చిమ ఆసియాలో యుద్ధాన్ని ముగించడానికి ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలకు ఇజ్రాయెల్ చర్యలు కూడా అడ్డుకట్ట వేస్తున్నాయి. ఇరాన్ మద్దతు ఉన్న హిజ్బుల్లాపై పోరాటాన్ని ఆపడానికి ఇజ్రాయెల్ నిరాకరిస్తోంది. అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందంతో సంబంధం లేకుండా, ఇజ్రాయెల్ దళాలు దక్షిణ లెబనాన్‌లోని చారిత్రాత్మక ఓడరేవు పట్టణమైన టైర్‌పై జరిపిన ఘోరమైన వైమానిక దాడిలో కనీసం ఎనిమిది మంది మరణించారు. మార్చిలో హిజ్బుల్లా ఇజ్రాయెల్‌పై రాకెట్లను ప్రయోగించినప్పటి నుండి లెబనాన్‌పై జరిగిన అత్యంత భీకరమైన దాడి ఇదే కావడం గమనార్హం. ఇటు ఉత్తర ఇజ్రాయెల్‌లో లెబనాన్ సరిహద్దు సమీపంలోని రామిమ్ రిడ్జ్ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఒకరు మరణించారు. వాషింగ్టన్‌తో కుదిరే ఏ శాంతి ఒప్పందమైనా లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడుల ముగింపుతో ముడిపడి ఉంటుందని ఇరాన్ స్పష్టం చేస్తోంది. ఈ తాజా సైనిక ఘర్షణల వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ లాంటి హోర్ముజ్ జలసంధి గుండా వాణిజ్యం పునఃప్రారంభం కావడం మరింత ఆలస్యం కానుంది. యుద్ధానికి ముందు ప్రపంచంలోని ముడి చమురు మరియు ద్రవీకృత సహజ వాయువులో ఐదో వంతు ఈ మార్గం గుండానే రవాణా అయ్యేది. ప్రస్తుతం ఇరాన్ ఈ జలసంధిని దిగ్బంధించగా, అమెరికా కూడా ఇరాన్ ఓడరేవులపై ఆంక్షలు విధించింది. అయితే, హోర్ముజ్ గుండా నౌకా రవాణా క్రమంగా పెరుగుతోందని, కానీ ఇంధన సరఫరా సాధారణ స్థితికి రావడానికి చాలా నెలలు పడుతుందని అమెరికా ఇంధన శాఖ కార్యదర్శి క్రిస్ రైట్ తెలిపారు. భవిష్యత్తులో ఇరాన్‌తో కుదిరే ఏ శాంతి ఒప్పందమైనా ఆ దేశం అణ్వాయుధాన్ని అభివృద్ధి చేయకుండా అడ్డుకునేలా ఉండాలని ట్రంప్ డిమాండ్ చేస్తుండగా, తమపై అంతర్జాతీయ ఆంక్షలను ఎత్తివేయాలని, స్తంభింపజేసిన బిలియన్ల డాలర్ల ఆస్తులను విడుదల చేయాలని ఇరాన్ పట్టుబడుతోంది.

# ఏఐతో ఉద్యోగాలు సేఫ్ అనే వారు వినండి

**15 వేల మందిని తీసేస్తున్న కాగ్నిజెంట్**

కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ తన వ్యాపార గమనాన్ని సమూలంగా మార్చే దిశగా 'ప్రాజెక్ట్ లీప్' అనే ప్రతిష్టాత్మక ప్రణాళికను అమలు చేస్తోంది. కృత్రిమ మేధ పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో, సాంప్రదాయ ఐటీ సేవల నుండి అత్యాధునిక సాంకేతిక ఆధారిత సేవల వైపు మళ్లడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యం. అయితే, ఈ మార్పు ప్రక్రియలో భాగంగా జశీస్త్రఅఆట్శుఖ్ కంపెనీ తన అంతర్జాతీయ శ్రామిక శక్తిలో గణనీయమైన కోత విధిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 12 వేల నుండి 15 వేల మంది ఉద్యోగులను తొలగించడానికి కాగ్నిజెంట్ సిద్ధమవుతోంది. ఈ నిర్ణయం ఐటీ పరిశ్రమలో, ముఖ్యంగా భారతదేశంలో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. కాగ్నిజెంట్ మొత్తం ఉద్యోగుల్లో సుమారు రెండున్నర లక్షల మంది భారతీయులే కావడంతో.. ఈ కోత ప్రభావం అత్యధికంగా మన దేశంపైనే పడనుంది. దాదాపు 13 వేల మంది భారతీయ ఉద్యోగులు తమ ఉపాధిని కోల్పోయే ప్రమాదం ఉందని అంచనా. ఈ భారీ మార్పు వెనుక ఉన్న ప్రధాన కారణం ఐటీ పరిశ్రమలో నియామక నమూనా మారుతుండటమే. గత దశాబ్ద కాలంగా ఐటీ కంపెనీలు 'పిరమిడ్ మోడల్'ను అనుసరిస్తున్నాయి. ఇందులో భారీ సంఖ్యలో ఫ్రెషర్లు (జూనియర్లు) ఉండి, వారి పైన తక్కువ మంది సీనియర్లు పర్యవేక్షకులుగా ఉండేవారు. కానీ ప్రస్తుత డిజిటల్ యుగంలో క్లయింట్ల అవసరాలు మారాయి. వారు కేవలం పని జరిగితే సరిపోదని, అది అత్యంత సమర్థవంతంగా, వేగంగా జరగాలని కోరుకుంటున్నారు. అందుకే సీఈఓ రవి కుమార్ ఎస్ 'విశాలమైన, సంక్షిప్త పిరమిడ్' విధానాన్ని తెరపైకి తెచ్చారు. అంటే, సాధారణ పనులను ఏఐ, ఆటోమేషన్ ద్వారా పూర్తి చేస్తూ, కేవలం అత్యంత నైపుణ్యం కలిగిన నిపుణులనే కీలక బాధ్యతల్లో ఉంచడం ఈ వ్యూహం ఉద్దేశ్యం. దీనివల్ల మధ్య స్థాయి, జూనియర్ స్థాయి ఉద్యోగుల అవసరం తగ్గుతోంది. ఈ పునర్నిర్మాణ ప్రక్రియ కంపెనీపై భారీ ఆర్థిక భారాన్ని కూడా మోపుతోంది. ఉద్యోగ విరమణ ప్యాకేజీలు, ఇతర పునర్వ్యవస్థీకరణ ఖర్చుల కోసం కాగ్నిజెంట్ సుమారు ౨230 నుండి ౨320 మిలియన్ల వరకు కేటాయించింది. ఇందులో అధిక శాతం ఖర్చులు 2026 నాటికే పూర్తవుతాయని కంపెనీ భావిస్తోంది. అదే సమయంలో, ఏఐ రంగంలో తన పట్టును




పెంచుకోవడానికి వ్యూహాత్మక కొనుగోళ్లకు కూడా ప్రాధాన్యత ఇస్తోంది. దీనికి నిదర్శనంగా, ఏఐ-కేంద్రీకృత ఐటీ నిర్వహణ సంస్థ అయిన 'ఆస్ట్రేయా'ను సుమారు ౨600 మిలియన్లకు కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకుంది. అంటే ఒకవైపు ఉద్యోగుల సంఖ్యను తగ్గిస్తూనే, మరోవైపు సాంకేతిక మౌలిక సదుపాయాల కోసం భారీగా పెట్టుబడులు పెడుతోంది. కాగ్నిజెంట్ తీసుకుంటున్న ఈ చర్యలు కేవలం ఆ కంపెనీకి మాత్రమే పరిమితం కాలేదు. టీసీఎస్, యాక్సెంచర్, హెచ్‌సీఎల్‌టెక్, ఒరాకిల్ వంటి గ్లోబల్ ఐటీ దిగ్గజాలు కూడా దాదాపు ఇదే విధమైన మార్పులను అనుసరిస్తున్నాయి. మానవ శ్రమ, సాంకేతికతను మిళితం చేసే బృందాలను ఏర్పాటు చేయడం ద్వారా కంపెనీలు తమ ఉత్పాదకతను పెంచుకోవాలని చూస్తున్నాయి. సీఎఫ్ఓ జతిన్ దలాల్ అంచనాల ప్రకారం, ఈ ప్రాజెక్ట్ లీప్ ద్వారా 2026-27 నాటికి కంపెనీ వందల మిలియన్ డాలర్ల ఖర్చులను ఆదా చేయగలుగుతుంది. ఈ ఆదా అయిన మొత్తంలో కొంత భాగాన్ని తిరిగి ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధికి, భవిష్యత్ సాంకేతిక కొనుగోళ్లకు మళ్లించనున్నారు. క్లుప్తంగా చూస్తే, కాగ్నిజెంట్ చేపట్టిన ఈ పరివర్తన ఐటీ రంగంలో కొత్త శకానికి ఆరంభంగా కనిపిస్తోంది. ఇది తక్షణమే వేలాది మంది ఉద్యోగుల జీవితాలపై ప్రతికూల ప్రభావం చూపినప్పటికీ, దీర్ఘకాలంలో కంపెనీ యొక్క పోటీతత్వాన్ని, లాభదాయకతను పెంచుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఉద్యోగులు తమ నైపుణ్యాలను నిరంతరం పెంచుకోవాల్సిన ఆవశ్యకతను ఈ పరిణామాలు మరోసారి గుర్తు చేస్తున్నాయి. ఏఐ యుగంలో మనుగడ సాగించాలంటే కేవలం శ్రమ సరిపోదని, సాంకేతిక పరిజ్ఞానమే శ్రీరామరక్ష అని స్పష్టమవుతోంది.

## ఒరాకిల్ లేఆఫ్స్ , 20 వేల మంది సీనియర్ ఉద్యోగులు ఔట్




దారుణంగా ఫ్రెషర్ల పరిస్థితి.. టెక్ రంగంలో పెను మార్పులు సంభవిస్తున్నాయి. తాజాగా సాఫ్ట్‌వేర్ దిగ్గజం ఒరాకిల్ ప్రకటించిన తాజా లేఆఫ్స్ టెక్ రంగాన్ని నివ్వెరపరిచాయి. ప్రపంచవ్యాప్తంగా సుమారు 20 వేల నుంచి 30 వేల మంది ఉద్యోగులను తొలగించాలని సంస్థ నిర్ణయించడం, టెక్ ప్రపంచంలో నెలకొన్న అనిశ్చితికి అద్దం పడుతోంది. అమెరికా, ఇండియా, కెనడా, లాటిన్ అమెరికా దేశాల్లో ఉన్న ఒరాకిల్ కార్యాలయాలపై ఈ ప్రభావం తీవ్రంగా ఉండనుంది. సోమవారం ఉదయం ఉద్యోగులకు అందిన ఈ-మెయిల్స్ వారి భవిష్యత్తును ఒక్కసారిగా ప్రశ్నార్థకం చేశాయి. ఈ లేఆఫ్స్‌లో అత్యంత ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే.. కంపెనీ కేవలం ఖర్చు తగ్గించుకోవడమే కాకుండా, అత్యంత అనుభవం ఉన్న సీనియర్ ఉద్యోగులను సైతం లక్ష్యంగా చేసుకున్నట్లు కనిపిస్తోంది. దీనికి నిదర్శనంగా, ఒరాకిల్‌లో 33 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న నీనా లివిస్ వంటి సీనియర్ సెక్యూరిటీ ప్రొఫెషనల్ కూడా తన ఉద్యోగాన్ని కోల్పోయారు. 1990లో సంస్థలో చేరి, డేటాబేస్, ఎథికల్ హ్యాకింగ్, సెక్యూరిటీ ప్లాట్‌ఫామ్‌ల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన నిపుణులను కూడా వదులుకోవడం, కంపెనీ ప్రాధాన్యతలు ఏ విధంగా మారుతున్నాయో తెలియజేస్తోంది. కృత్రిమ మేధ ప్రభావం వల్ల సీనియర్ల స్థానాలు ప్రమాదంలో పడ్డాయని నీనా లివిస్ వ్యక్తం చేసిన అభిప్రాయం ఇప్పుడు సాఫ్ట్‌వేర్ నిపుణుల్లో చర్చనీయాంశమైంది. రాతీఖఎశ్రీవ మాత్రమే కాకుండా మెటా, మైక్రోసాఫ్ట్, డిస్నీ వంటి ఇతర దిగ్గజ సంస్థలు కూడా గత కొంతకాలంగా భారీగా ఉద్యోగాలను తొలగిస్తున్నాయి. ఈ కంపెనీలన్నీ ఇప్పుడు "ఏఐ ఫస్ట్" అనే వ్యూహంతో ముందుకు వెళ్తున్నాయి. అంటే, పనులను ఆటోమేట్ చేయడం ద్వారా మానవ వనరుల అవసరాన్ని తగ్గించుకోవడమే వీటి ప్రధాన లక్ష్యం. తక్కువ పెట్టుబడితో, తక్కువ మంది ఉద్యోగులతో అధిక లాభాలను ఆర్జించాలనే కార్పొరేట్ ధోరణి పెరిగింది. ఈ క్రమంలోనే భారీ వేతనాలు తీసుకునే సీనియర్ల కంటే, ఏఐ సాంకేతికతను వాడుకుంటూ తక్కువ జీతానికి పనిచేసే యువ ఉద్యోగుల వైపు కంపెనీలు మొగ్గు చూపుతున్నాయి. ఈ మార్పుల వల్ల కొత్తగా పట్టభద్రులైన ఫ్రెషర్ల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ఒకప్పుడు ఎంట్రీ లెవల్ ఉద్యోగాలు విరివిగా లభించేవి, కానీ ఇప్పుడు ఆ పనులన్నీ ఆటోమేషన్ పరిధిలోకి వెళ్లిపోయాయి. టాప్ కంపెనీలు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ తగ్గించడమే కాకుండా, అత్యవసరమైతే తప్ప కొత్తవారిని తీసుకోవడం లేదు. దీంతో నిన్నటి వరకు సురక్షితమని భావించిన మేనేజర్, డైరెక్టర్ స్థాయి ఉద్యోగాలు కూడా ఇప్పుడు గ్యారెంటీ లేకుండా పోయాయి. విద్యా సంస్థలు సైతం ఇప్పుడు 100 శాతం ఉద్యోగ హామీ ఇవ్వలేకపోతున్నాయి. ఒరాకిల్ తన వ్యాపారాన్ని క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వైపు మళ్లించుకుంటోంది. ఈ ప్రక్రియలో భాగంగా తన వర్క్‌ఫోర్స్‌ను పూర్తిగా పునర్నిర్మించుకుంటోంది. సాంకేతికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ, పాత తరం నైపుణ్యాల కంటే ఆధునిక ఏఐ నైపుణ్యాలకు విలువ పెరుగుతోంది. అయితే, దశాబ్దాల కాలం కంపెనీ ఎదుగుదల కోసం శ్రమించిన నిపుణులను ఇలా హఠాత్తుగా తొలగించడం శోచనీయం. లాభాలే పరమావధిగా సాగుతున్న ఈ ప్రయాణంలో ఉద్యోగ భద్రత అనేది నేడు ఒక మిథ్యగా మారుతోంది. టెక్ నిపుణులు తమను తాము నిరంతరం అప్‌డేట్ చేసుకుంటే తప్ప, ఈ పోటీ ప్రపంచంలో మనుగడ సాగించడం కష్టతరంగా మారుతోంది.ం

## టీసీఎస్ కీలక నిర్ణయం ఐటీ ఉద్యోగాల్లో ఏఐ ఏజెంట్ల హవా, ఫ్రెషర్ల నియామకాలపై భారీ ప్రభావం!







ఐటీ రంగంలో పెను మార్పులు రాబోతున్నాయని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ స్పష్టం చేశారు. త్వరలోనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏజెంట్లు వివిధ విభాగాల్లో మనుషులతో సమానంగా పనిచేస్తారని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల దేశంలోనే అతిపెద్ద సాఫ్ట్‌వేర్ సంస్థ అయిన టీసీఎస్ నియామక ప్రక్రియలో శాశ్వత మార్పులు రానున్నాయి. ఇకపై కేవలం ఉద్యోగుల సంఖ్య కంటే, ఆటోమేషన్ టూల్స్ ద్వారా పని సామర్థ్యాన్ని పెంచుకోవడంపైనే కంపెనీ ప్రధానంగా దృష్టి పెట్టనుంది.ప్రస్తుతం టెక్ పరిశ్రమలో పాత రిక్రూట్‌మెంట్ పద్ధతులు సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఇన్ఫోసిస్, విప్రో వంటి దిగ్గజ కంపెనీలు కూడా ప్రాజెక్టుల వేగం పెరిగినప్పటికీ, క్యాంపస్ నియామకాలను తగ్గించాయి. ఏఐ టూల్స్ వల్ల ఉత్పాదకత పెరగడంతో, తక్కువ మంది సిబ్బందితోనే ఎక్కువ పనిని పూర్తి చేసే అవకాశం కలిగింది. ఈ పరిణామం భారతీయ ఐటీ రంగంలో ఎంట్రీ లెవల్ ఉద్యోగాల కోతకు దారితీసేలా కనిపిస్తోంది. ఏజెంట్ల ప్రభావం: ఫ్రెషర్ల నియామకాలు, ఐటీ ఉద్యోగాల భవితవ్యంఐటీ రంగంలో ఇప్పుడు జనరల్ సాఫ్ట్‌వేర్ రోల్స్ కంటే స్పెషలైజ్డ్ టాలెంట్‌కే డిమాండ్ పెరుగుతోంది. భవిష్యత్తులో మెషిన్ లెర్నింగ్ ఆపరేషన్స్ , డేటా ఇంజనీరింగ్ వంటి విభాగాల్లో నైపుణ్యం ఉన్నవారికే ప్రాధాన్యత ఉంటుంది. అనుభవం ఉన్నవారిని తీసుకునేటప్పుడు కూడా 'ఏజెంటిక్ వర్క్‌ఫ్లోస్' నిర్వహించగల వారికే కంపెనీలు మొగ్గు చూపుతున్నాయి. గ్లోబల్ మార్కెట్‌లో ప్రాజెక్టుల డెలివరీ, క్లయింట్ సంతృప్తి కోసం ఈ ఏఐ ప్రక్రియలు ఇప్పుడు కీలకంగా మారాయి. అందుకే, కొత్తగా వచ్చే టెక్నాలజీలపై పట్టు ఉన్న అభ్యర్థులకే రిక్రూటర్లు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు.నైపుణ్యం నియామకాల ట్రెండ్మరియు భారీ డిమాండ్డేటా ఇంజనీరింగ్అత్యంత ప్రాధాన్యతబేసిక్ డెవలప్‌మెంట్ తగ్గిన నియామకాలుస్కిల్స్ మార్పు.. కార్పొరేట్ రంగంలో ఏఐ ఏజెంట్ల హవా2027 ఆర్థిక సంవత్సరం నాటికి జీతాల నిర్మాణంలో, ముఖ్యంగా వేరియబుల్ పేలో భారీ మార్పులు ఉండవచ్చు. ఉద్యోగి ఉత్పాదకత, ఏఐ టూల్స్‌ను ఎంతవరకు వాడుతున్నారనే అంశాల ఆధారంగానే ఈ చెల్లింపులు ఉండే అవకాశం ఉంది. ఆటోమేషన్ వేగంగా పెరుగుతున్న తరుణంలో ఉద్యోగులు తమ నైపుణ్యాలను పెంచుకోవడం ) తప్పనిసరని నిపుణులు సూచిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో ఏఐని భాగం చేసే సిబ్బందికి కంపెనీలు మంచి ప్రోత్సాహకాలను అందిస్తున్నాయి. లాభాలను పెంచుకుంటూనే, అంతర్జాతీయ క్లయింట్‌లకు వేగంగా సేవలు అందించడమే లక్ష్యంగా కంపెనీలు ఈ వ్యూహాన్ని అనుసరిస్తున్నాయి.బేసిక్ కోడింగ్ పనుల కోసం భారీగా ఉద్యోగులను తీసుకునే రోజులు త్వరలోనే ముగియనున్నాయి. ఈ పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే భారతీయ ఐటీ నిపుణులు నిరంతరం కొత్త విషయాలు నేర్చుకుంటూ ఉండాలి. ఏఐ ఏజెంట్ల వైపు మళ్లుతున్న ఈ మార్పును అందిపుచ్చుకోవాలంటే నైపుణ్యాల అభివృద్ధిలో చురుగ్గా ఉండటం ఒక్కటే మార్గం. ఆటోమేషన్‌ను అధిగమించి కెరీర్‌లో ఎదగాలంటే ఈ మార్పులకు అనుగుణంగా మారడం అత్యవసరం. ఇదే భారతీయ సాఫ్ట్‌వేర్ రంగ భవిష్యత్తును నిర్ణయించనుంది.




## నాని ‘ది పారడైజ్’ మళ్లీ వాయిదా? రవితేజ ‘ఇరుముడి’ కోసమేనా!


నాచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ ‘ది పారడైజ్’ మరోసారి వాయిదా పడే దిశగా కనిపిస్తోంది. మొదట మార్చి 26న విడుదల కావాల్సిన ఈ చిత్రం, ఆ తర్వాత ఆగస్టు 21కి వాయిదా పడిన సంగతి తెలిసిందే. అయితే, ఇప్పుడు ఆ ఆగస్టు 21వ తేదీని మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న ‘ఇరుముడి’ సినిమా లాక్ చేసుకోవడంతో నాని సినిమా పోస్ట్‌పోన్ కాక తప్పని పరిస్థితి ఏర్పడింది. సినిమాకు సంబంధించిన కొంత వర్క్ ఇంకా పెండింగ్‌లో ఉండటమే ఈ ఆలస్యానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. సోషల్ మీడియాలో వినిపిస్తున్న తాజా సమాచారం ప్రకారం.. ‘ది పారడైజ్’ చిత్రం సెప్టెంబర్ నెలలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది. అయితే, ఇది కేవలం ప్రచారం మాత్రమేనని, దీనిపై చిత్ర యూనిట్ నుండి అధికారిక ప్రకటన రావాల్సి ఉందని ఇండస్ట్రీ టాక్. బ్లాక్‌బస్టర్ ‘దసరా’ తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో ‘ది పారడైజ్’ పై భారీ అంచనాలు ఉన్నాయి. ఎస్ఎల్‌వి సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో కాయాదు లోహర్ హీరోయిన్ గా నటిస్తుండగా, కలెక్షన్ కింగ్ మోహన్ బాబు విలన్ పాత్రలో నటిస్తున్నాడు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని అందిస్తున్నాడు.

## ‘పెద్ది’కి మళ్లీ రిపేర్లు.. సెకండాఫ్‌లో కీలక మార్పులు, కొత్త వెర్షన్ సిద్ధం!



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ‘పెద్ది’ బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లతో దూసుకుపోతున్నప్పటికీ, సినిమా కంటెంట్ విషయంలో వచ్చిన విమర్శలను మేకర్స్ సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకులు, విమర్శకుల నుంచి మిశ్రమ స్పందన వచ్చిన నేపథ్యంలో దర్శకుడు బుచ్చిబాబు సానా ఈ చిత్రాన్ని మరింత మెరుగుపరచే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే జాన్వీ కపూర్ పాత్రకు సంబంధించిన కొన్ని సన్నివేశాలు సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలకు గురయ్యాయి. హీరోయిన్‌ను చూపించిన తీరు, కొన్ని షాట్లపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో దర్శకుడు బుచ్చిబాబు క్షమాపణలు చెబుతూ ఆ సన్నివేశాలను తొలగించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం థియేటర్లలో ఆ మార్పులతో కూడిన వెర్షన్ ప్రదర్శితమవుతోంది. అయితే తాజా సమాచారం ప్రకారం, ‘పెద్ది’లో మార్పులు అక్కడితో ఆగలేదని తెలుస్తోంది. ముఖ్యంగా సెకండాఫ్ నిడివి, కథనం వేగంపై ప్రేక్షకుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను దృష్టిలో పెట్టుకుని మరిన్ని ఎడిటింగ్ మార్పులు చేయాలని చిత్రబృందం నిర్ణయించినట్లు టాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో సెకండాఫ్‌లో వచ్చే కొన్ని ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్స్‌ను తగ్గించి, వాటి స్థానంలో రామ్ చరణ్ మరియు జగపతి బాబు పాత్రల మధ్య భావోద్వేగపూరిత సన్నివేశాలను జోడించే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని సమాచారం. ఈ మార్పులతో కథ మరింత బలంగా, భావోద్వేగంగా కనెక్ట్ అవుతుందని భావిస్తున్నారట. అలాగే సినిమాలోని కొన్ని నెమ్మదిగా సాగిన భాగాలను కత్తిరించి, కథనాన్ని మరింత రేసీగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ప్రేక్షకుల దృష్టిని నిలబెట్టేలా సెకండాఫ్‌ను మరింత గ్రిప్పింగ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ మార్పులు చేస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఎడిటింగ్ పనులు పూర్తయిన తర్వాత చిత్రానికి మళ్లీ సెన్సార్ అనుమతి తీసుకుని, కొత్త వెర్షన్‌ను థియేటర్లలో ప్రదర్శించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. వీలైనంత త్వరగా, ముఖ్యంగా వచ్చే వీకెండ్‌కు ముందే ఈ అప్‌డేటెడ్ వెర్షన్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే, మిశ్రమ టాక్ వచ్చినప్పటికీ ‘పెద్ది’ బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు నమోదు చేస్తూ ముందుకు సాగుతోంది. ఇప్పుడు ఈ కొత్త మార్పులు సినిమాకు మరింత బలాన్ని చేకూరుస్తాయా? కలెక్షన్లపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయా? అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.

## దేశ విభజన నేపథ్యంలో సన్నీ డియోల్ ‘బట్వారా 1947’.. విడుదల తేదీ ఖరారు!






బాలీవుడ్ యాక్షన్ స్టార్ సన్నీ డియోల్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ హిస్టారికల్ డ్రామా చిత్రం నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఇప్పటివరకు ‘లాహోర్ 1947’ అనే వర్కింగ్ టైటిల్‌తో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా పేరును అధికారికంగా ‘బట్వారా 1947’ గా మారుస్తూ చిత్రబృందం సరికొత్త మోషన్ పోస్టర్‌ను విడుదల చేసింది. దేశ విభజన నాటి భయానక పరిస్థితులు, ద్వేషం మధ్య ఒక వ్యక్తి చూపించిన అసాధారణ ధైర్యం నేపథ్యంలో సాగే ఈ భావోద్వేగభరితమైన చిత్రాన్ని స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా 2026, ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. గతంలో ‘ఘాయల్’, ‘దామిని’, ‘ఘాతక్’ వంటి ఇండస్ట్రీ హిట్లను అందించిన స్టార్ డైరెక్టర్ రాజ్‌కుమార్ సంతోషి, సన్నీ డియోల్ కాంబినేషన్‌లో చాలా ఏళ్ల తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను మిస్టర్ పర్ఫెక్ట్ ఆమిర్ ఖాన్ తన ‘ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్’ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండటం విశేషం. ఈ చిత్రంలో సన్నీ డియోల్ సరసన సీనియర్ స్టార్ హీరోయిన్ ప్రీతి జింతా నటిస్తుండగా, శబానా అజ్మీ, అలీ ఫజల్, కరణ్ డియోల్, కనికా కపూర్, సర్గమ్ సింగ్, ఖుషీ హజారే కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ గ్రహీత ఎ.ఆర్. రెహమాన్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు.

## వీడి అనుమానంలో మనం విడిపోయేలా ఉన్నాం’



యంగ్ హీరో రాగ్ మయూర్ నటించిన లేటేస్ట్ సైకాలాజికల్ కామెడీ ఎంటర్‌టైనర్ అనుమాన పక్షి. ఈ సినిమాకు విమల్ కృష్ణ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని రాజీవ్ చిలకా, రాజేశ్ జగ్తియాని, హిరాచంద్ దండ్ నిర్మించారు. ఈ చిత్రంలో మెరిన్ ఫిలిప్ హీరోయిన్‌గా నటించింది. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. తాజాగా రిలీజైన టీజర్ చూస్తుంటే ప్రతి విషయానికి అనుమానపడే వ్యక్తిగా హీరో రాగ్ మయూర్ కనిపించారు. ప్రతిదాన్ని అనుమానించే హీరో పెళ్లి విషయంలో ఏం చేశారనే నేపథ్యంలోనే ఈ మూవీని తెరకెక్కించినట్లు అర్థమవుతోంది. ఈ మూవీలో ప్రిన్స్, అనన్య, చరిత్, బ్రహ్మాజీ, రాశి, ?అజయ్ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా జూలై 10న థియేటర్లలో సందడి చేయనుంది.





## నాగ చైతన్య సూపర్ హిట్ థ్రిల్లర్ సిరీస్‌పై క్రేజీ బజ్ ..

### ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ జత కట్టిన క్రేజీ కాంబో

అక్కినేని యువ హీరో నాగ చైతన్య ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఒకవైపు భారీ థ్రిల్లర్ మూవీ ‘వృష కర్మ’లో నటిస్తూనే, మరోవైపు తన కెరీర్‌లో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ఓటీటీ సిరీస్ ‘దూత’ రెండో సీజన్ కోసం కూడా సిద్ధమవుతున్నారు. ఇప్పటికే అధికారికంగా ప్రారంభమైన ‘దూత 2’పై రోజురోజుకు ఆసక్తికరమైన వార్తలు వెలుగులోకి వస్తున్నాయి. దర్శకుడు విక్రమ్ కె కుమార్ తెరకెక్కించిన ‘దూత’ తొలి సీజన్ ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ఆదరణను సొంతం చేసుకుంది. హారర్, మిస్టరీ, థ్రిల్లర్ అంశాల కలయికతో రూపొందిన ఈ సిరీస్ ఓటీటీ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా, నాగ చైతన్యకు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో మంచి గుర్తింపును తీసుకొచ్చింది. ఇప్పుడు రెండో సీజన్ మరింత భారీ స్థాయిలో తెరకెక్కనున్నట్లు సమాచారం. తాజాగా సినీ వర్గాల్లో వినిపిస్తున్న వార్తల ప్రకారం, ప్రముఖ నటి భూమిక చావ్లా ‘దూత 2’లో కీలక పాత్ర పోషించనున్నారట. ఈ విషయంపై అధికారిక ప్రకటన రానప్పటికీ, భూమిక పాత్ర కథలో ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటుందని ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఈ వార్త నిజమైతే, నాగ చైతన్య-భూమిక కాంబినేషన్ మరోసారి ప్రేక్షకులను అలరించనుంది. ఇప్పటికే 2018లో వచ్చిన ‘సవ్యసాచి’ చిత్రంలో నాగ చైతన్యతో కలిసి నటించిన భూమిక, ఇప్పుడు ‘దూత 2’లో మరో ఆసక్తికరమైన పాత్రలో కనిపించబోతున్నారని టాక్. ఆమె పాత్ర కథనంలో కీలక మలుపులకు కారణమవుతుందని కూడా సినీ వర్గాలు చెబుతున్నాయి. మొదటి సీజన్‌లో ప్రింట్ మీడియా, వార్తాపత్రికల నేపథ్యంలో సాగే భయానక మిస్టరీని దర్శకుడు విక్రమ్ కె కుమార్ అద్భుతంగా చూపించారు. జరగబోయే ఘటనలను ముందుగానే చెప్పే వార్తాపత్రికల కాన్సెప్ట్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇప్పుడు రెండో సీజన్‌లో పూర్తిగా కొత్త కాన్సెప్ట్‌తో ప్రేక్షకులను థ్రిల్ చేయడానికి దర్శకుడు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అత్యాధునిక టెక్నాలజీ, డిజిటల్ ప్రపంచం లేదా మరొక వినూత్నమైన అంశాన్ని కథలో భాగం చేయనున్నారనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. అయితే మేకర్స్ మాత్రం కథకు సంబంధించిన వివరాలను గోప్యంగా ఉంచుతున్నారు. ఇక ఈ సిరీస్ మరో ప్రత్యేకత ఏమిటంటే, నాగ చైతన్య కేవలం హీరోగానే కాకుండా నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నారు. ఆయన కెరీర్‌లో నిర్మాతగా ప్రారంభించిన తొలి ప్రాజెక్ట్ ‘దూత 2’ కావడం విశేషం. దీంతో ఈ సిరీస్‌పై చైతన్య ప్రత్యేక శ్రద్ధ పెట్టుతున్నట్లు సమాచారం.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.